మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త



## బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన సామాజిక బాధ్యత : ఎస్పీ పరితోష్ పంకజ్

**సంగారెడ్డి టౌన్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన సామాజిక బాధ్యతగా స్వీకరించాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్-11 ద్వారా 126 మంది బాలకార్మికులకు విముక్తి కల్పించడం జరిగిందన్నారు. బాలకార్మికులను పనిలో పెట్టుకున్న 81 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. ఆపరేషన్ ముస్కాన్‌ను విజయవంతం చేసిన ఆయా శాఖల అధికారులకు, సిబ్బందికి ఎస్పి పరితోష్ పంకజ్ అభినందించారు. ఈసందర్భంగా ఎస్పి మాట్లాడుతూ బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్‌లను ప్రారంభించిందన్నారు. బాలకార్మికులను విముక్తులను చేస్తూ విద్యను అందుకునేందుకు పాఠశాలలకు పంపేలా చర్యలు తీసుకుంటోందన్నారు. చిన్నారులను పనిలో పెట్టుకున్నా, వెట్టిచాకిరికి గురిచేసినా, బలవంతంగా భిక్షాటన చేయించినా పశువుల కాపరులుగా పనిలో పెట్టుకున్నా, హోటళ్ళు, ఇటుక బట్టీల్లో, కిరాణ కొట్టుల్లో, మెకానిక్ దుకాణాల్లో, ఫ్యాక్టరీల్లో పెట్టుకుంటే జైలు ఊసలు లెక్కపెట్టక తప్పదని హెచ్చరించారు. బాలకార్మికులను కానవస్తే చైల్డ్ లైన్ నంబర్ 1098, 100కు కాల్ చేయాలన్నారు.

## మండల పరిషత్‌ను తనిఖీ చేసిన జడ్పీ సిఇవో

**చౌటకూరు, ఆగస్టు 1, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయాన్ని శుక్రవారం జడ్పీ సీఈఓ కె జానకిరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులను జానకిరెడ్డి పరిశీలించారు. విధి నిర్వహణలో అలక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. స్థానిక సంస్థలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాలను, ఓటర్ల జాబితాను సిద్ధంగా ఉన్నాయా అంటూ ఎంపిడిఓ శంకర్‌ను అడిగి తెలుసుకున్నారు. విధులకు నాల్గవ తరగతి ఉద్యోగి హైదరలీ, జూనియర్ సహాయకులు ఎల్.ప్రీతానాయక్ హాజరు కాకపోవడంతో హాజరు రిజిస్టర్‌లో గైర్హాజరు వేశారు. విధులకు దుమ్మా కొట్టే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈఓ.



తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ హైమావతి

## భూ భారతి రెవెన్యూ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

**కొండపాక, ఆగస్టు 1, ప్రభాతవార్త :** భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను భూ భారతి చట్టం నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె.హైమావతి తహసీల్దార్ శ్యామ్‌ను ఆదేశించారు. శుక్రవారం కొండపాక మండల సమీకృత కార్యాలయ సముదాయాన్ని ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలోని భూ భారతి రెవెన్యూ సదస్సుల పెండింగ్ దరఖాస్తులను పరిశీలించారు. భూ హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి చట్టం అమలులో ప్రజల నుండి భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. అనంతరం ఎంపిడిఓ కార్యాలయాన్ని సందర్శించి ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియలో 273 ఇళ్లు మంజూరికాగా 237 మాత్రమే నిర్మాణం చేపట్టారని తెలిపారు. 100 శాతం లబ్ధిదారులు ఇళ్ల నిర్మించుకునేల చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇండ్లు మంజూరైనవారు ఇండ్లు కట్టుకోవడానికి సుముకంగాలేని వారికి నోటీసులు ఇచ్చి వారి పేర్లు జాబితా నుండి తొలగించి కొత్త వారికి మంజూరి చేయాలన్నారు. నిర్మాణంలో ఉన్న ఇండ్లు వేగంగా త్వరగా పూర్తి అయ్యేలా రోజు పర్యవేక్షణ చేయ్యాలని ఎంపిడిఓ వెంకటేశ్వర్లను ఆదేశించారు.

## తరగతి గదులను మంజూరు చేయాలి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

**బెజ్జంకి, ఆగస్టు 1, ప్రభాతవార్త :** మండల పరిధిలోని చీలాపూర్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు కూర్చోవడానికి గదులు లేక ఆరుబయట కూర్చుని విద్యను అభ్యసిస్తున్నారని..పాఠశాలకు తరగతి గదులను మంజూరు చేయాలని మండల పర్యటనకు విచ్చేసిన జిల్లా కలెక్టర్ కె.హైమావతికి శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకుల శానగొండ శరత్, మానాల రవి వినతిపత్రం అందజేశారు. అలాగే మండలంలో మంజూరైన ఇందిరమ్మ ఇల్లు బెస్‌మెట్ లెవల్ పూర్తికావడంతో మట్టి, మోరం నింపేం దుకు అధికారులు అనుమతులు ఇవ్వడం లేదని దీంతో మట్టి మాఫియా దారులు అధిక ధరలతో మట్టిని విక్రయిస్తున్నారని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సంగెం మధు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

## రోగులకు మంచి వైద్యం అందేలా చూడాలి

### జిల్లా వైద్యాధికారి డాక్టర్ ధనరాజ్



రికార్డులను పరిశీలిస్తున్న డిఎం అండ్ హెచ్ఓ ధనరాజ్

**నంగునూర్, ఆగస్టు 1,ప్రభాతవార్త :** ప్రభుత్వ ఆసుపత్రిలో అందుతున్న వైద్యసేవలపై ప్రజలకు నమ్మకం కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ధనరాజ్ అన్నారు. శుక్రవారం నంగునూర్ మండలం రాజగోపాలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికం గా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మంచి వైద్యం అందేలా చూడాలన్నారు. గర్భవతులకు, పిల్లలకు అందించాల్సిన వ్యాధి నిరోధక టీకాలను సకాలంలో అందించాలని ఆదేశించారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆసుపత్రిలో మందుల కొరత లేకుండా చూడాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు జరిగేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలన్నారు. అన్ని పరీక్షలు ప్రభుత్వ ఆసుపత్రిలోనే చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని మెడికల్ స్టోర్, ల్యాబ్, ఓపి, సిబ్బంది హాజరు శాతాన్ని పరిశీలించారు. ఆయన వెంట ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్ యాదవ్, డాక్టర్ సరిత, హెచ్ఇవో స్వామి, మహిళా సూపర్‌వైజర్ అనురాధ, వైద్య సిబ్బంది ఉన్నారు.

## నానో ఎరువులతో అధిక దిగుబడులు : డిఇవో

**కౌడిపల్లి, ఆగస్టు 1, ప్రభాతవార్త:** నానో ఎరువులతో అధిక దిగుబడులను పొందవచ్చునని జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్ తెలిపారు. శుక్రవారం కృషి విజ్ఞాన కేంద్రం తునికిలో నానో ఎరువుల ఉపయోగించే విధానం, వాటి వలన కలిగే లాభాల గురించి మెదక్ జిల్లా వ్యవసాయ విభాగం, కృషి విజ్ఞాన కేంద్రం, కోరమండల్ ఫర్టిలైజర్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రైతులతో చర్చాగోష్టి నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డిఇవో మాట్లాడుతూ రైతులు సాంప్రదాయపద్ధంగా ఉన్న డిఎపి, యూరియా వాడకంవల్ల పెట్టుబడి ఖర్చులతో పాటుగా నేల నీరు కాలుష్యం ఏర్పడుతుందన్నారు. నూతన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించబడిన నానో ద్రవ రూపంలో ఉన్న యూరియా, డిఏపీలను వాడినట్లయితే రైతులకు తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు పొందవచ్చని చెప్పారు. అనంతరం డాక్టర్ సంబాజి దత్తాత్రేయ నల్కర్, సీనియర్ సైంటిస్ట్ అండ్ హెడ్, కృషి విజ్ఞాన కేంద్రం వారు మాట్లాడుతూ రైతులు సమీకృత వ్యవసాయ విధానాలు అవలంబిస్తూ, పంట మార్పిడి చేస్తూ నేల ఆరోగ్యం పెంపొందిస్తూ అధిక దిగుబడులు సాధించాలని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎన్ ప్రతాపరెడ్డి, కోరమండల్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

**బెజ్జంకి, ఆగస్టు 1, ప్రభాతవార్త :** ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని, నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి హెచ్చరించారు. బెజ్జంకిలో ఆమె శుక్రవారం ఆకస్మిక పర్యటన చేసి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించి రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఉదయం 10 గంటలు దాటిపోయిన స్టాఫ్ నర్సు, అటెండర్ తప్ప ఆసుపత్రిలో ఎవరూ లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రికి సమయానికి రాని రోజుల్లో ఫిర్యాదు రాసి డిఎం అండ్ హెచ్ఓకు పంపించి సమయానికి రాని వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆసుపత్రి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. అనంతరం మండలకేంద్రంలోని రైతు సేవ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులకు అందించిన ఎరువులపై ఆరా తీశారు. రోజు వారి స్టాక్ వివరాలను బోర్డు నమోదు చేయాలని యజమానిని ఆదేశించారు. రైతులకు భూమి ప్రకారం ఎరువులు అందజేయాలని ఇష్టానుసారంగా వ్యవహరిస్తే సహించేదిలేదన్నారు. గోదాంలో ఎరువులు పరిశీలించి స్టాక్ రిజిస్టర్, సేల్స్ రిజిస్టర్‌లో ఉన్న వివరాలకు పొంతన లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలతో సామాగ్రి రేట్లు ఎక్కువగా పెంచారని లబ్ధిదారులు తెలపగా తహసీల్దార్, ఎంపిడిఓలను దుకాణాల యజమానులతో సమావేశం నిర్వహించి ధరలను స్థిరీకరణ చేయాలని ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూ భారతి చట్టంలోని మార్గదర్శకాల ప్రకారం దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. మండల పరిధిలోని గుండారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల, ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. మెనూప్రకారం భోజనం అందించాలన్నారు. ఆమె వెంట తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపిడిఓ, ఎంపివో, ఎస్ఐ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.



పిహెచ్‌సిని తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ హైమావతి

# ఆలస్యమైతే..ఆబ్సెంటే..

### ..ప్రభుత్వ పాఠశాలలో నూతన ఒరవడికి శ్రీకారం.. సమయపాలన పాటించడానికే ఎఫ్ఆర్ఎస్

**నారాయణఖేడ్, ఆగస్టు 1 ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు తప్పనిసరిగా సమయపాలన పాటించేలా ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్) అమల్లోకి వచ్చింది. శుక్రవారం నుంచి తెలంగాణ విద్యాశాఖ ఎఫ్ఆర్ఎస్‌ను అమలుచేస్తోంది. ఈ మేరకు జిల్లా అధికారులకు ఇప్పటికే మౌఖిక ఆదేశాలు జారీ చేసింది. నేటి నుంచి పాఠశాలల్లో ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ తొలిరోజు యాప్‌లో ఉపాధ్యాయుల వివరాల రిజిస్ట్రేషన్, మరుసటి రోజు నుంచి సెల్‌ఫోన్లలో అటెండెన్స్, సమయపాలన పాటించని టీచర్లకు ముకుతాడే. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు తప్పనిసరిగా సమయపాలన పాటించేలా ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్) అమల్లోకి రానుంది. శుక్రవారం నుంచి తెలంగాణ విద్యాశాఖ ఎఫ్ఆర్ఎస్‌ను అమలు చేస్తోంది. ఈ మేరకు జిల్లా అధికారులకు ఇప్పటికే మౌఖిక ఆదేశాలు జారీ చేసింది. మండలంలో 86 ప్రభుత్వ పాఠశాలల ఉండగా అందులో 69 ప్రాథమిక పాఠశాలలు, 10 ఉన్నత పాఠశాలలు, 3 యూపీఎస్ పాఠశాలలు, 1 కేజీబి కలిపి ప్రస్తుతం ఆయాస్కూళ్లలో 17,000 విద్యార్థులు చదువుతున్నారు.345 మంది ఉపాధ్యాయులు బోధనలు అందిస్తున్నారు. పలు స్కూళ్లలో పనిచేస్తున్న కొందరు టీచర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రోజువారీ విధులకు హాజరుకావడంలో తీవ్ర నిర్లక్ష్యం చూపిస్తున్నారు. స్కూల్ కాంప్లెక్స్ మీటింగులని, డీఈఓ ఆఫీసలో పని ఉందని చెబుతూ నెలలో వారానికి పైగా దుమ్మా కొడుతున్నట్లు తెలుస్తోంది. అలాంటి వారికి ఇపుడు ముకుతాడు పడనుంది. కొన్ని నెలలుగా పైలెట్ ప్రాజెక్టుగా నిర్వహించిన కార్యక్రమాన్ని శుక్రవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్నారు. తొలిరోజు యాప్‌లో పేర్లు రిజిస్ట్రేషన్ పాఠశాలల్లో ప్రస్తుతం విద్యార్థులకు మాత్రమే ఎఫ్ఆర్ఎస్ ద్వారా అటెండెన్స్‌ను తీసుకుంటున్నారు. ఉపాధ్యాయులు ఉదయం, సాయంత్రం ఎఫ్ఆర్ఎస్‌లో అటెండెన్స్‌ను వేసుకోవాల్సి ఉంటుంది. యాప్‌లో జియో ట్యాగింగ్ ఉండడంతో టీచర్ ఎక్కడున్నాడో సులువుగా తెలుసుకునే అవకాశం ఉంటుంది. తద్వారా కచ్చితంగా పని వేళలు ముగిసే వరకు స్కూల్‌లో ఉండనున్నారు. ఇదిలా ఉండగా, ఎఫ్ఆర్ఎస్ ప్రక్రియలో భాగంగా తొలిరోజు శుక్రవారం టీచర్లు ఫోన్‌లో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని, తర్వాత ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను లాగవుట్ చేయాలని అధికారులు సూచించారు. తిరిగి లాగిన్ కావడానికి యాప్‌ను అప్‌డేట్ చేసుకోవాలన్నారు. ఏది ఏమైనప్పటికీ ఫేస్ రికగ్నైజేషన్ సిస్టం రావడంతో ఉపాధ్యాయులు సమయపాలన పాటించడానికి ఉపయోగపడుతుందని చెప్పవచ్చు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి జయరాజు

## సోషలిజమే దేశానికి ప్రత్యామ్నాయం

### -సిపిఎం జిల్లా కార్యదర్శి జయరాజు

**పుల్‌కల్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై, హక్కుల రక్షణకై పోరాటం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సింగూరులో పార్టీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులకు జయరాజు హాజరై కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. 11 ఏళ్ల బిజెపి పాలనలో ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం పెరిగిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశాన్ని దోచుకుంటున్న కార్పొరేట్ శక్తులకు లక్షల కోట్ల రాయితీలు ఇస్తున్న ప్రభుత్వం ఓటు వేసి గెలిపించిన సామాన్య ప్రజలను జీఎస్టీ పేరుతో దోచుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 8 గంటల నుంచి 12 గంటలకు పని గంటలను పెంచి కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలు పరిష్కరించకుండా విద్వేషాలు రెచ్చగొడుతూ పాలన సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలకు నిధులు కేటాయించకుండా ఇబ్బందులకు గరిచేయడం తగునా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలం అయిందని విచారం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా స్థానిక సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ(ఎం) అందోల్ డివిజన్ కార్యదర్శి డి విద్యాసాగర్, పుల్‌కల్ మండల బాధ్యులు కృష్ణ, చౌటకూరు మండల బాధ్యులు నాగభూషణం పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతో ఆరోగ్యం

**చిన్నశంకరంపేట, ఆగస్టు 1,ప్రభాతవార్త:** పౌష్టికాహారంతో పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజమ్మ తెలిపారు. శుక్రవారం చిన్నశంకరంపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీలకు, బాలింతలకు తల్లిపాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్ నాగరాణిలు పాల్గొన్నారు.



కళాశాలను తనిఖీ చేస్తున్న సిద్దిపేట డిఐఈవో రవీందర్‌రెడ్డి

## కళాశాలలో అడ్మిషన్ల సంఖ్య పెంచాలి : డిఇవో

**చిన్నకోడూరు, ఆగస్టు 1, ప్రభాతవార్త :** విద్యార్థులు ప్రతి రోజు క్రమం తప్పకుండా కళాశాలకు వచ్చి ఇష్టంతో చదువుతూ అనుకున్న లక్ష్యాన్ని నెరవేర్చుకోవాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి రవీందర్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రతి తరగతిలోని విద్యార్థులతో సమావేశం నిర్వహించి ప్రతి రోజు జరుగుతున్న తరగతులపై ఆరా తీశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎంసెట్, నీట్ ఆన్‌లైన్ క్లాసెస్ జరుగుతున్నాయని అడిగి తెలుసుకున్నారు.

## ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య : డిఇవో

**చిన్నశంకరంపేట, ఆగస్టు 1,ప్రభాతవార్త:**

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ తెలిపారు. శుక్రవారం మండల పరిధి మడూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న కాంప్లెక్స్ పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు లభిస్తున్నాయన్నారు. విద్యార్థుల చదువులపై శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రవిందర్, గజగట్లపల్లి, సంగాయపల్లి, చెన్నాయిపల్లి, వెంకట్‌రావుపల్లి, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో రాధాకిషన్

# రైతులకు సరిపడా యూరియా అందించాలి

### సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన యూరియా కోట తగ్గడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎడ్ల గురువారెడ్డి భవన్ లో శుక్రవారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ, మండల, పట్టణ కార్యదర్శుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులకు యూరియా కొరత లేకుండా వెంటనే సరిపడా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. యూరియా కొరత వ్యవసాయ పనులకు ఆటంకం కల్పిస్తుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రావాల్సిన యూరియా కోటను తగ్గించడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రాష్ట్రానికి రావాల్సిన యూరియాను తెప్పించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అన్యాయం జరిగిన అర్హులకు వెంటనే ఇళ్లు కేటాయించాలన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రభుత్వంపై సీపీఐ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. గ్రామ గ్రామాన పార్టీని బలోపేతం చేసి స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ నాయకులకు సూచించారు. సమావేశంలో పార్టీ నాయకులు కిష్టపురం లక్ష్మణ్, గడిపే మల్లేష్, దయానందరెడ్డి, సత్యనారాయణ, వనేష్, అశోక్, భాస్కర్, జేరిపోతుల జనార్ధన్, శంకర్, రూపేష్, శ్రీనివాస్, బన్సీలాల్, సుధాకర్, రంగారెడ్డి, బాల మోహన్, యాదగిరి, బంక రాజయ్య, రాజేశం, నరేష్ తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న పవన్



ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

### విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే

## కఠిన చర్యలు తీసుకుంటాం

### మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

**చిన్నశంకరంపేట, ఆగస్టు 1,ప్రభాతవార్త:** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ఆగ్రో రైతు సేవా కేంద్రాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శుక్రవారం చిన్నశంకరంపేటలోని తెలంగాణ రైతు ఆగ్రో సేవా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయా లేదా, ఎరువుల విక్రయాలను ఈ-పాస్ ద్వారా నిర్వహిస్తున్నారా లేదా అని తనిఖీ చేశారు. ఎరువుల నిల్వల విషయాన్ని స్టాక్ బోర్డులో ప్రదర్శించాలని సూచించారు. కృత్రిమ ఎరువుల కొరతను సృష్టించినా, అధిక ధరలకు అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వానాకాలం సీజన్‌కు పంటల సాగు కోసం రైతుల అవసరాలకు సరిపడా యూరియా ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి

### మెదక్ ఎస్పీ శ్రీనివాసరావు




మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు.

**మెదక్ టౌన్, ఆగస్టు 1, ప్రభాతవార్త :** జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం సైబర్ వారియర్స్‌ని ఉద్దేశించి జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ నేటి డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో, ప్రతి పోలీస్ సిబ్బంది, సైబర్ రంగంలో పూర్తి అవగాహన కలిగి ఉండటం అవసరమన్నారు .మెదక్ జిల్లా పరిధిలో సైబర్ క్రైమ్ నియంత్రణపై సిబ్బందికి ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాలు నిరోధించేందుకు ప్రతి పోలీస్ అధికారి సాంకేతిక పరిజ్ఞానాన్ని మెరుగుపరుచుకోనీ, ప్రతి కేసును సీరియస్‌గా తీసుకుని బాధితులకు తక్షణ న్యాయం జరిగేటట్లు చూడాలన్నారు. సైబర్ నేరాలపై సమగ్ర అవగాహనతోనే సమర్థవంతమైన చర్యలు తీసుకోవచ్చు ప్రతి పోలీస్ స్టేషన్‌లో సైబర్‌నేరాలపై నిపుణులుగా ఏర్పడాలి.ప్రజలకు తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.1930 ద్వారా వెంటనే ఫిర్యాదు చేయాల్సిన అవసరాన్ని ప్రజలకు తెలియజేయలన్నారు. మెదక్ జిల్లా పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించేటటువంటి సైబర్ వారియర్స్ అందరికీ తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, హైదరాబాద్ టీ షర్ట్స్ అందివ్వడం జరిగింది. పోలీసు స్టేషన్లో సైబర్ వారియర్స్ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు.

## ఆర్థిక సమస్యలతో రైతు ఆత్మహత్య

**జగదేవ్‌పూర్, ఆగస్టు 1 ప్రభాతవార్త :** ఆర్థిక సమస్యలను తట్టుకోలేక ఒక వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జగదేవ్‌పూర్ మండలం తీగుల్ గ్రామంలో చోటుచేసుకుంది. జగదేవ్‌పూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తీగుల్ గ్రామానికి చెందిన బుధారి నరేందర్(34) అనే రైతు తనకున్న కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తుండగా ఇతనికి భార్యతో పాటు ముగ్గురు సంతానం ఉన్నారు. గతకొంత కాలంగా ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతూ ఇటీవల ఎనిమిది గుంటల భూమిని అమ్మినా అతని అప్పులు తీరలేదు. శుక్రవారం పంట చిట్టి కట్టడానికి డబ్బులు లేకపోవడంతో మనస్థాపంతో ఉదయం 10 గంటల సమయంలో తన వ్యవసాయ పొలం వద్ద ఉన్న వేప చెట్టుకు తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని భార్య రేవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## చెరువులో పడి వ్యక్తి మృతి

**కంది, ఆగస్టు 1, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కవలంపేట శివారులోని ఉదంచెరువులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. సంగారెడ్డి రూరల్ ఎస్ఐ రవీందర్ కథనం ప్రకారం... గ్రామానికి చెందిన జగన్మోహన్(44) చెరువులో పడి మృతి చెందాడన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని చెరువులో నుంచి మృతదేహాన్ని వెలికి తీసి పంచనామ నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రవీందర్ వివరించారు.

## పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్, పోలీసుల దాడి

### -రూ.28,100 నగదు, 4 మొబైల్ ఫోన్‌లు స్వాధీనం

**గజ్వేల్ టౌన్, ఆగస్టు 1 (ప్రభాతవార్త):** పేకాట స్థావరంపై సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు, గజ్వేల్ పోలీసులు దాడిచేసిన సంఘటన గజ్వేల్ పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణంలోని పాత గ్రామ పంచాయతీ సమీపంలో కరుణాకర్ ఉంటున్న అద్దె ఇంట్లో కొంతమంది వ్యక్తులు పేకాట ఆడుతున్నారని నమ్మదగిన సమాచారంతో గురువారం రాత్రి సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు, గజ్వేల్ పోలీసులు దాడిచేసి నలుగురిని పట్టుకోగా ఒకరు పరార్యయ్యారు. వారినుంచి రూ.28,100తో పాటు 4 మొబైల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. వర్గల్ మండలం నెంటూర్ గ్రామానికి చెందిన మహమ్మద్ కరీం, మైలారంకు చెందిన గుంటూజు వెంకటేష్, పోతుగళ్ల భాస్కర్, జబ్బాపూర్‌కు చెందిన బూరుగుపల్లి శివలను అదుపులోకి తీసుకోగా రిమ్మనగూడకు చెందిన కరుణాకర్ పరారయ్యాడు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ అధికారులు మాట్లాడుతూ గ్రామాలలో, పట్టణాలలో, ఫామ్‌హౌస్‌లలో, ఇళ్లలో, బహిరంగ ప్రదేశాలలో పేకాట, జూదం మరే ఇతర చట్ట వ్యతిరేక కార్యక్రమాలు ఎవరైనా నిర్వహిస్తున్నట్లు తెలిస్తే వెంటనే సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ అధికారులకు 8712667445, 8712667446, 8712667447 నెంబర్లకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

## కుర్మ సంఘం భవనానికి స్పీకర్ శంకుస్థాపన



కుర్మ సంఘం భవనానికి శంఖుస్థాపన చేస్తున్న అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 1, ప్రభాతవార్త :**

మున్సిపల్ పరిధిలోని బిల్లదాకలలో సిడిపి(ఎమ్మెల్సీ)నిధులు రూ.50 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించే కుర్మ సంఘం భవనానికి శుక్రవారం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ శంఖుస్థాపన చేశారు. కుర్మ సంఘం భవన నిర్మాణానికి ఎస్డిఎఫ్ నిధుల నుండి కోటి రూపాయల ు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, పంచాయత్‌రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉమేష్ కుమార్, ఆర్టిఏ సభ్యులు జాఫర్, మాజీ ఎమ్మెల్సీ, కుర్మ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎగ్గే మల్లేశం, గొర్రె కాపరుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సదానందం, కుర్మ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జనహిత పాదయాత్రలో మాజీ ఎంపిపి రాచర్ల వెంకటేశ్వర్లు



కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు

**యాచారం ఆగస్టు1, ప్రభాతవార్త..**

జనహిత పాదయాత్రలో పాల్గొన్న యాచారం మండల మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కార్యకర్తల ఉద్దేశించి సమావేశంలో మాట్లాడుతూ.. ప్రజలను నేరుగా కలుసుకోవడానికి తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్ ,టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వంలో కొనసాగుతున్నదన్నారు. జనహిత పాదయాత్రలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా పాలన, ప్రభుత్వ సంక్షేమ పథకాలను జనంలోకి తీసుకెళ్లాలని వారి విలువైన సూచనలు సలహాలు అందజేస్తున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో నిరుపేదల సంక్షేమం కోసం అర్హులైన అసలు సిసలైన వారికే సంక్షేమ పథకాలు అందుతున్నాయని ధీమా వ్యక్తం చేశారు. జనాభా ప్రతిపాదికన హైదరాబాద్ శివారులైన ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మంత్రి పదవి ఎమ్మెల్యేకు ఇవ్వాల్సి ందేనని కోరారు. ఈ ప్రాంతం అభివృద్ధి జరగాలంటే జనాభా అధికంగా ఉన్న సందర్భంగా అధిక నిధులు మంజూరు చేసి అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీ జనాభా ప్రతిపాదికన అధికంగా ఉన్నారని గుర్తించి కేవలం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోనే 42 శాతం రిజర్వేషన్ల కు ప్రతిపాదనలు వెళ్లి కార్యరూపం దాల్చనుందనీ గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నోళ్ళ యాదయ్యకు పితృవియోగం

**యాచారం ఆగస్టు 1 ప్రభాతవార్త :**

యాచారం మండలం మాల్ గ్రామానికి చెందిన మాజీ జడ్పిటిసి చిన్నోళ్ల జంగమ్మ మామ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి కర్నాటి రమేష్ గౌడ్ బీఆర్ఎస్ నేతలు కలిసి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నీవాళ్ల అర్పించారు. చిన్నోళ్ల జంగమ్మ యాదయ్యలను పరామర్శించి ఓదార్చారు.

## తమ్మలోనిగుడా గ్రామపంచాయతీని పరిశీలించిన ఎంపిడివో



పింఛన్‌దారులతో ఎంపిడివో గ్రామపంచాయతీ కార్యదర్శి

**యాచారం ఆగస్టు 1 ప్రభాతవార్త :**

యాచారం మండల పరిధిలోని వివిధ గ్రామాలలోని నర్సరీలు పింఛన్ల పంపిణీ తదితర అంశాలను ఎంపీడీవో రాధా రాణి శుక్రవారం పరిశీలించారు. తమ్ములనిగూడ లోని గ్రామ పంచాయతీని రికార్డులను తనిఖీ చేశారు. పించన్దారులతో ముఖాముఖి గా వివరాలను అడిగి సేకరించారు. పింఛన్దారులకు ఇబ్బంది పెట్టరాదని సూచన చేశారు. నర్సరీలలో మొక్కలు అన్నిటిని నాటించి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో సూపరిండెంట్ శైలజ, గ్రామ కార్యదర్శులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## పాఠశాల భవనం పరిశీలించిన అధికారులు..



పాఠశాల గదులను పరిశీలిస్తున్న అధికారులు

**దుద్యాల్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కుదురుమల్ల గ్రామ పాఠశాలలో భవనం శిథిలావస్థకు చేరడంతో పైకప్పు పెచ్చులూడి పడుతుంది. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పలుమార్లు ఉన్నత అధికారులకు తెలపగా శుక్రవారం పాఠశాల భవనము ు పంచాయతీరాజ్ ఏఈ నాగేందర్, మండల విద్యాధికారి విజయరామారావు, ఎంపీడీవో మహేష్ కుమార్ లు పరిశీలించారు. ఏఈ నాగేందర్ కాడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి ని సంప్రదించగా అదనపు గదుల అవసర నిమిత్తం నాలుగు కొత్త గదులకు ప్రణాళిక సిద్ధం చేయాలని కడ అధికారి ఆదేశించినట్లు తెలిపారు. అదనపు గదుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి త్వరలో మంజూరు చేస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రఘుపతి, సూర్య ప్రకాశ్ రెడ్డి, యాదవ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్సీ

**నందిగామ ఆగస్టు 1 ప్రభాతవార్త:**

నందిగామ మండలం తాటిగడ్డ తండాకు చెందిన జటావత్ కిషన్ శోభ దంపతుల కుమార్తె నందిని వివాహం నందిగామ మండల కేంద్రంలో ఉన్న ప్రిన్స్ గార్డెన్లో శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకలకు ఉమ్మడి మహబూబ్నగర్ ఎమ్మెల్సీ ఎన్ నవీన్ కుమార్ రెడ్డి హాజరై వధూవరులు నందినిమహిపాల్ నాయక్ లను ఆశీర్వదించారు. ఈ వేడుకల్లో ముడావత్ గబ్రుచౌహన్, మాజీ ఎంపీటీసీ రమావత్ రాజునాయక్, కౌన్సిలర్లు సోమ్లా నాయక్, మాదారం నరసింహులు గౌడ్, జటావత్ విజయ్ నాయక్, గణేష్ నాయక్, పరుశురాం, పాత్లావత్ హనుమంతు, ముడావత్ రవీందర్, శ్రీనివాస్, రవీందర్, కారోబార్ జటావత్ శ్రీను నాయక్ తదితరులు ఉన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల చెల్లింపులో లోపాలుంటే తెలపండి : కలెక్టర్ ప్రతీక్ జైన్

**నవాబుపేట ఆగస్టు 1, ప్రభాతవార్త :**

మండలంలో నిర్మాణాల్లో ఉన్న ఇందిరమ్మ ఇళ్ళకు సంబంధించిన బిల్లుల చెల్లింపులో ఏదైనా సాంకేతిక పరమైన సమస్యలు ఏర్పడితే వెంటనే తనకు తెలియజేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూరిభా ఆశ్రమ పాఠశాల వద్ద నిర్మాణం జరుగుతున్న భవనం పనులను, ఆదర్శ పాఠశాల భవనంలో నిర్వహిస్తున్న మరమత్తు పనులను, మండల కేంద్రంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ళ బిల్లుల చెల్లింపు ఏదైనా సమస్య ఏరపడితే వెంటనే తనకు తెలియజేయాలని అన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న పనుల్లో వేగం పెంచాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాభోదనతో పాటు మెను ప్రకారం నాణ్యతతో కూడిన ఆహారాన్ని అంధించాన్నారు. ఎప్పకప్పుడు విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. కేజీబివి పాఠశాలలోని తరగతి గదిలోకి వెళ్ళి విద్యార్థినీలతో మాట్లాడారు. విద్యార్థులు విధిగా ఆంగ్లంలో నిత్యం మాట్లాడటం అలవరుచుకోవాలని దీంతో అనర్గళంగా మాట్లడగల సామర్థ్యం వస్తుందని అన్నారు. అదేవిధంగా విద్యార్థులకు కావాల్సిన సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినీలకు నోటు పుస్తకాలను అంజేశారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ బుచ్చయ్య, ఎంపిడివో అనురాధ, ప్రిన్స్‌పాల్ కృష్ణకుమార్, ఎస్‌వో శ్రీలత, కార్యదర్శి నవనీత తదితరులు పాల్గోన్నారు.



విదార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

## యాచారంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు

**యాచారం, ఆగస్టు1, ప్రభాతవార్త :**

ఐసిడిఎస్ ఇబ్రహీంపట్నం ప్రాజెక్ట్ పరిధిలోని యాచారం గ్రామంలో శుక్రవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు సిడిపిఓ వినీతాదేవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపివో మాట్లాడుతూ..స్థిరమైన మద్దతు ఇచ్చే వ్యవస్థలను ఏర్పరిచి తల్లిపాల సంస్కృతి ప్రోత్సాహానికి ప్రాధాన్యత ఇద్దాం అను అంశాన్ని ఈ సంవత్సరం 2025 తల్లిపాల వారోత్సవాల సందేశంగా ప్రకటించడమైందన్నారు. తల్లిపాలు శిశు ఆరోగ్యం , జీవన రక్షణకు అత్యంత ప్రభావవంతమైన మార్గాలలో ఒకటి పిల్లలల్లో విరేచనాలు, న్యూమోనియా వంటి వ్యాధుల నుండి రక్షణనిస్తుందని తెలిపారు. అధిక బరువు, మధుమేహం వంటి సమస్యలకు తక్కువగా లోన వుతారు. తల్లిపాలతో పెరిగే పిల్లల్లో మేధస్సు ఎక్కువగా ఉంటుందని కావున పుట్టిన గంటలోపే తల్లి పాలు ఇవ్వాలని సూచన చేశారు. బిడ్డకు రెండు సంవత్సరాల వచ్చే వరకు తల్లిపాలు ఖచ్చితంగా ఇవ్వాలిని, దాని తో పాటు 6నెలలు నిండిన తరువాత అదనపు పోషకాహారం ఇవ్వడం వల్ల బిడ్డ ఆరోగ్యంగా ఉంటాడ అని. తల్లిపాల వారోత్సవాలు ఆగస్ట్ 1వ తేది నుండి 8వ తేది వరుకు నిర్వహించీడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా గర్భిణీలకు, బాలింతలకు, వారి కుటుంబసభ్యులకు ఆవగాహన కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ అరుణ, తులసి, అంగన్వాడి టీచర్లు అంజమ్మ, విజయ, సావిత్రి, యాదమ్మ,సుజాత, సరిత, వసంత, మంజుల, భారతి, లావణ్య, సాలమ్మ సువర్ణ, ఆశా వర్కర్, లబ్దిదారులు పాల్గొన్నారు.



యాచారం అంగన్వాడి కేంద్రంలో తల్లి పాల వారోత్సవంలో పాల్గొన్న అంగన్వాడి సూపర్వైజర్లు టీచర్లు

## ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ ప్రాధాన్యత : ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్‌నగర్ ఆగస్టు1, ప్రభాతవార్త, :**

ప్రజారోగ్య పరిరక్షణకే ప్రభుత్వం తొలి ప్రాధాన్యతను ఇస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో ప్రతి పేదవాడి ఆరోగ్యానికి ప్రభుత్వం భోసా కల్పిస్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో షాద్‌నగర్ నియోజకవర్గ వ్యాప్తంగా ఆరు మండలాల్లోని మొత్తం 62 మంది లబ్దిదారులకు ఎమ్మెల్యే శంకర్ రూ.35.28 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయ నిధి పేదలకు వరమని, అనారోగ్యంతో ఆర్థికంగా చితికిపోయిన కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ పథకం అండగా నిలుస్తుందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజారోగ్యం కోసం ప్రభుత్వం వేల కోట్లు ఖర్చుచేస్తుందని, వెంటనే బాధితులకు ఉపశమనం కల్పిస్తూ నగదును వారి ఖాతాల్లో జమ చేస్తుందని అన్నారు. నందిగామ మండలంలోని ఐదు మంది లబ్దిదారులకు రూ.2.23 లక్షలు, కేశంపేట మండలంలో 9 మంది లబ్దిదారులకు రూ.3.20 లక్షలు, కొందుర్గు మండలంలో 10 మంది లబ్దిదారులకు రూ.4.96 లక్షలు, ఫరూఖ్‌నగర్ మండలంలో 13 మంది లబ్దిదారులకు రూ.6 లక్షల 41 వేల 500 రూపాయలు, షాద్‌నగర్ పట్టణంలో 6 మంది లబ్దిదారులకు రూ.7.21 లక్షలు, కొత్తూరులో 11 మంది లబ్దిదారులకు రూ.6.35 లక్షలు, జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో 5 మంది లబ్దిదారులకు రూ.2.41 లక్షలు, మరికొంత మందికి రూ.2.50 లక్షల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అంజేసినట్లు ఎమ్మెల్యే వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీఖాన్ బాబర్, ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జంగ నరసింహ్మ యాదవ్, వీరేష్, రాజు, శ్రీకాంత్ రెడ్డి, హరినాథ్ రెడ్డి, పట్టణ కమిటీ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య, నాయకులు చెంది తిరుపతిరెడ్డి, రఘు నాయక్, లింగారెడ్డిగూడ అశోక్, కృష్ణారెడ్డి, జాంగారి రవి, సీతారాం పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

## ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల కొరత !

**-ఇద్దరు ఉపాధ్యాయులు, 13 మంది విద్యార్థులు**

**-రెండు నెలల నుంచి మద్యాహ్న భోజనం బంద్**

**-సంబందిత అధికారుల పర్యవేక్షణ లోపం !**

**-బడిబాట కార్యక్రమ నిర్వహణలో అధికారులు విఫలం !!**



ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనం చేస్తున్న విద్యార్థులు

**పెద్దేముల్, ఆగస్టు 1, ప్రభాతవార్త:**

ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యా భోధనలు కొనసాగించాలని ప్రభుత్వం పదేపదే చెబుతున్నసంబందిత అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారిందని పలువురు ఆరోపణలు చేస్తున్నారు. పాఠశాలల అభివృద్ధి, మెరుగైన విద్యా భోధనల కోసం ప్రభుత్వం లక్షలాది రూపాయిలు ఖర్చు చేస్తున్న ఫలితం దక్కడంలేదు, పెద్దేముల్ మండలం తింసాన్‌పల్లి గ్రామంలోనిప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు కొనసాగుతున్న పాఠశాలలో 13 మంది విద్యార్థులకు గాను ఒక హెచ్‌ఎం, ఒక ఉపాధ్యాయురాలు విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం 7 గురు విద్యార్థులకు గాను ఒక ఉపాధ్యాయురాలు హజరు కాగా హెచ్‌ఎం సేలవు తీసుకున్నారు. అయితే 5వ తరగతి వరకు కొనసాగుతున్న పాఠశాలలో, పాఠశాల పున: ప్రారంభం నుంచే మధ్యాహ్న భోజనం నిర్వహించడంలేదు. దీంతో విద్యార్థులు తమ తమ ఇండ్ల నుంచి భోజనం తీసుకొచ్చి పాఠశాలలో భోజనం చేస్తున్నారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో మద్యాహ్న భోజనం నిర్వహించాలని ప్రభుత్వ నిబంధనలు ఉన్న వాటిని సంబందిత అధికారులు, ఉపాధ్యాయులు బేఖాతరు చేస్తున్నారని పలువురు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. తింసాన్‌పల్లి గ్రామంలో సుమారు 950 మంది జనాభాకలిగిన, పాఠశాలకు 13 మంది విద్యార్థులు రావడం గమనార్హం. బడీడు పిల్లలు బడిలో ఉండాలన్న విషయం సంబందిత అధికారులు, ఉపాధ్యాయులు, పిల్లల తల్లితండ్రులకు అవగాహన కల్పించకపోవడంతో ప్రైవేటు పాఠశాలలకు వెళ్ళడానికి ఆసక్తి చూపుతున్నారు. బడి బాట కారక్రమం నిర్వహణలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారనడానికి ఇది నిదర్శమని అంటున్నారు. సంబందిత అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ప్రభుత్వ పాఠశాలల పనితీరు రోజురోజుకు పడిపోవడమే కాకుండా ఉత్తీర్ణత శాతం కూడా తగ్గుతోందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలల పనితీరు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. మండల విద్యాదికారి నర్సింగ్‌రావు వివరణ: రెండు నెలల నుంచి మద్యాహ్న భోజనం నిర్వహించడంలేదని వివరణ కొరగా, పాఠశాలలో మద్యాహ్నభోజన నిర్వహకులుగా సుజాత పనిచేస్తుందని, 13 మంది విద్యార్థులకు గాను ప్రభుత్వం ఇచ్చే రేటు గిట్టు బాటు కాకపోవడంతో ఆమే తమ విధులకు రాజీనామచేసినట్లు తెలిపారు. విద్యార్థులకు మద్యాహ్న భోజనం కోసం కొత్త వారిని నియమించేందుకు ప్రయత్నం చేస్తున్నామని ఆయన వివరణ ఇచ్చారు. ఇట్టి విషయంఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలిపారు.




తింసాన్‌పల్లి ప్రాథమిక పాఠశాల

## వంద రోజుల కార్యచరణను పకడ్బందీగా అమలు చేయాలి

**కీసర, ఆగస్టు1, ప్రభాతవార్తః**

మున్సిపాలిటీల్లో ప్రగతి,పారిశుద్ధ్యం మెరుగు పరిచేందుకు ప్రభుత్వం చేపట్టిన వంద రోజుల కార్యచరణ ప్రణాళికను పకడ్బందిగా అమలు చేయాలని దమ్మాయిగూడ మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్ పుష్పలత అన్నారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వంద రోజుల ప్రణాళికలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ పర్యావరణం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. వనమహోత్సవంలో బాగంగా ప్రజలకు మున్సిపల్ సిబ్బంది 15550 పూల,పండ్ల మొక్కలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఇంటింటికి పొడి,తడి వ్యర్ధాలను వేరు చేయడంపై అవగాహన కల్పించారు. ప్రతి రోజు వీధి,పెంపుడు కుక్కలపై ఏబిసి ప్రచారం జరుగుతుందన్నారు. భూగర్భ మురికి కాలువలో మున్సిపల్ సిబ్బందితో చెత్తను తొలగించడం జరిగిందన్నారు. చెత్త ఆటోలు వచ్చినప్పుడు చెత్తను అందులో వేయాలని రోడ్డకు ఇరువైపులా ఏవరైనా చెత్తను వేస్తే జరిమానా విధించడం జరుగుతుందన్నారు. భవానీ ఫంక్షన్ హాల్‌లో మున్సిపల్ ప్రజలకు, మున్సిపల్ సిబ్బందికి స్నేహ మహిళా సంఘాల మహిళలకు మెడిసిటి హస్పిటల్ ఆద్వర్యంలో అన్ని రకాల ఉచితంగా ఆరోగ్య పరీక్షలు, మందులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ వెంకట్‌రెడ్డి, డిఈఈ బాలమురళి, మున్సిపల్ మేనేజర్ వెంకటేశం, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ సిబ్బందికి అన్ని రకాల పరీక్షలు చేయిస్తున్న స్పెషల్ ఆఫీసర్ పుష్పలత, కమీషనర్ వెంకట్‌రెడ్డి

## అంగన్‌వాడీ విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ..



ఏకరూప దుస్తులను అందజేస్తున్న అధికారులు

**దుద్యాల్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఆలేడ్ గ్రామంలోని అంగన్వాడి చిన్నారులకు ఎంపీవో సత్యనారాయణ ఏకరూప దుస్తుల ు అందించారు. పూర్వ ప్రాథమిక దశలో చిన్నారులు చదువు పట్ల ఆసక్తి పెంచుకుంటే, ప్రాథమిక దశలో బాగా నేర్చుకుంటారని అందుకుగా ను అంగన్వాడీ టీచర్ పూర్తిస్థాయిలో చిన్నారులకు ఆటపాటలతో, జ్ఞానాన్ని అందించాలని అన్నారు. చిన్నారుల ఆరోగ్యం పై శ్రద్ధ ఉంచాలని, వారికి మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ భారతి రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రమేష్, ఆయ వెంకటమ్మ, కొడంగల్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, గ్రామస్తులు శ్రీధర్ గౌడ్, నరసింహులు గౌడ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## పిఆర్టియూటిఎస్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు




సభ్యత్వ నమోదులో పాల్గొన్న పీఆర్‌టీయూ సంఘం నాయకులు

**ధారూరు, ఆగస్టు 1, ప్రభాతవార్త:**

ధారూర్ పిఆర్టియూటిఎస్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమం మండల పరిధిలోని ము న్నూరు సోమరం ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. ముఖ్యతిథిగా పిఆర్టియూటిఎస్ జిల్లా అధ్యక్షులు కడియాల చంద్ర శేఖర్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ,పిఆర్టియూటిఎస్ ఎల్లపుడు ఉపాధ్యాయుల సంక్షేమం కోసం,పాఠశాల అభివృద్ధి కొరకు పాటు పడే సంఘము అని చెప్పారు. వివిద రకాల ఉన్న ఉపాధ్యాయుల పెండింగ్ తొందరగా విడుదల చేయాలని,అలాగే పి ఆర్ సి రిపోర్ట్‌ను కమిషన్ నుంచి తొందరగా తెప్పించడానికి, త్వరగా పిఆర్‌సి 50శాతం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు. పదోన్నతులు షెడ్యూల్ ఇప్పించిన ఘనత కూడా పిఆర్టియూటిఎస్ కృషియే అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కె.మాణిక్యం, అధ్యక్షులు మల్లికార్జున్, రాష్ట్ర కార్యావర్గ సభ్యులు, రవీందర్ రెడ్డి, గుణవంత్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు, సత్యం,సుదర్శన్, అశోక్. మండల కార్యవర్గ సభ్యులు, శ్రీనివాస్, బుచ్చయ్య, నిజామోద్దీన్‌లు పాల్గొన్నారు.

## అభాగ్యుల పాలిట... ఆత్మబంధువు ఎమ్మెల్యే శంకర్



ఎక్స్‌గ్రేషియా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్.

**నందిగామ ఆగస్టు 1 ప్రభాతవార్త:** ఆరేళ్ల నిరీక్షణకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చొరవతో ఓ కన్నతల్లికి ఊరట లభించింది. కరెంట్ షాక్ ప్రమాదంలో కొడుకుని కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆమెకు ఆరేళ్ల తర్వాత ఆమె నిరీక్షణకు తెరపడినట్లు అయింది. నందిగామ మండలం చేగూరు గ్రామానికి చెందిన ఫాతిమా బేగం కుమారుడు అజ్మత్ విద్యుత్ శాఖలో ఔట్ సోర్స్ కార్మికునిగా పనిచేస్తూ 2019 మే 24న విద్యుత్ షాక్ గురై మృతి చెందాడు. అప్పటినుంచి ప్రభుత్వ పరిహారం కోసం.. అధికారుల చుట్టూ తిరిగిన ఫలితం కానరాలేదు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ జోక్యంతో రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా మంజూరైన చెక్కును శుక్రవారం ఎమ్మెల్యే అజ్మత్ తల్లికి అందజేశారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లికి ఆసరాగ ఎక్స్‌గ్రేషియా మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు, షాద్నగర్ విద్యుత్ డిఇ శ్యాంసుందర్ రెడ్డి, ఏడి రవీందర్ లకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జంగ నరసింహులు,మంకాల శ్రీశైలం, కొత్తూరు మండల అధ్యక్షుడు జి హరినాథ్ రెడ్డి, కాంగ్రెస్ యువనేత జినుగుంట్ల నవీన్ కుమార్ గౌడ్ తదితరులున్నారు.

## నేడు నందిగామలో బాల్య వివాహాలపై న్యాయ విజ్ఞాన సదస్సు

**నందిగామ ఆగస్టు 1 ప్రభాతవార్త**

నందిగామ మండల కేంద్రంలో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు బాల్య వివాహాలపై న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు మండల న్యాయ సేవ సంస్థ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు, ప్రజలు సద్వినియోగం చేసుకొని విజయవంతం చేయాలని వారు పేర్కొన్నారు.

## ఉద్యోగుల పెండింగ్ సమస్యలు తక్షణమే పరిష్కరించాలి




నందిగామలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పి ఆర్ టి యు ఉద్యోగ సంఘాలు.

**నందిగామ ఆగస్టు1 ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్రంలో ఉపాధ్యాయ ఉద్యోగులకు ఉన్న పెండింగ్ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని పి ఆర్ టి యు జిల్లా అధ్యక్షులు సామల మహేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నందిగామ మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పి ఆర్ టి యు 2025 సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 2023 జూలై 1 నుండి అమలు చేయాల్సిన పిఆర్సి ఇప్పటికే రెండు సంవత్సరాలు గడిచిన నివేదిక వెలువరించకపోవడం అన్యాయమని వెంటనే పిఆర్సి నివేదికను వైరుగతపరిచి ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాలతో చర్చించి అందరికీ ఆమోదయోగమైన ఫిట్మెంట్తో వెంటనే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు జిల్లా గౌరవ అధ్యక్షులు పెద్దమాల రాఘవేందర్ నందిగామ మండలం శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జ్ఞానేశ్వర్ రెడ్డి,హరి హోమ్, కొత్తూరు మండల శాఖ ప్రధాన కార్యదర్శి కృష్ణ అధ్యక్షులు ప్రతాప రెడ్డి,రాష్ట్ర బాధ్యులు కిష్టారెడ్డి కిష్టారెడ్డి రెడ్డి, దామోదర్ రెడ్డి,వెంకటేష్ ,జంగయ్య, సోము భూపాల్ రెడ్డి, ఆనందం, జిహెచ్‌ఎం వెంకటరామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల మొదటి విడత బిల్లుల మంజూరు పట్ల హర్షం

### ఎమ్మెల్యే శంకర్‌ను సన్మానించిన లబ్దిదారులు

**షాద్‌నగర్ ఆగస్టు1, ప్రభాతవార్త :** ప్రజా ప్రభుత్వంలో పేదలకు ఇచ్చిన మాట ప్రకారం ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసి, మొదటి విడత బిల్లులు మంజూరు చేయడంతో లబ్దిదారులు స్థానిక ఎమ్మెల్యే శంకర్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తమ సొంతింటి కలను సాకారం చేసిన ఎమ్మెల్యే రుణపడి ఉంటామని అన్నారు. ఇకముందు కూడా ప్రభుత్వ సహకారం పేద ప్రజలకు ఉండాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెసన నాయకులు దిలీప్ కుమార్, గంగనమోని సత్తయ్య, గంగ్రాతి సాయి, లబ్దిదారులు కొక్కు చంద్రమ్మ, నాగులపల్లి లక్ష్మీ, మిద్దెగూడెం శ్యామలమ్మ, గంగ్రాతి శ్యామలమ్మ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

## పార్టీ కోసం కష్టపడే వారికే పదవులు

### బిజెపి మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి

**అక్కన్నపేట, ఆగస్టు 1, ప్రభాతవార్త :** పార్టీ కోసం పనిచేసే ప్రతీ ఒక్కరికి మంచి పదవులు వస్తాయని బిజెపి మండల అధ్యక్షుడు రామంచ మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సంరచన అభియాన్ కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మండలంలో ఉన్న 43 బూత్ కమిటీల కార్యవర్గలతో పాటు క్రియాశీలక సభ్యత్వాల జాబితా, బిజెపి అనుమ్మ మోర్చ కార్యవర్గాలకు ఆసక్తిగల నాయకుల పేర్లను సేకరించారు. సేకరంచిన పేర్లను జిల్లా కమిటీకి పంపించడం జరుగుతుందన్నారు. పార్టీ కోసం, ప్రతిష్ట కోసం పని చేసే ప్రతీ కార్యకర్తకు పార్టీలో మంచి గుర్తింపు ఉంటుందని చెప్పారు. పార్టీ కార్యకర్తలు వచ్చే స్థానిక సంస్థలలో మండల వ్యాప్తంగా పార్టీ జెండా ఎగిరే విధంగా కృషిచేయాలన్నారు.కార్యక్రమంలో ఎంపిటిసి, జడ్పిటిసిల మండల కన్వీనర్ గొల్లపల్లి వీరాచారి, జిల్లా కౌన్సిల్ సభ్యులు కర్ణకంటి నరేష్, నాయకులు చెరుకు సంపత్, మోహన్, తిరుపతినాయక్, రవీందర్, కుమార్, రాజ్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## వాసవీ మాతకు ప్రత్యేక పూజలు

**గజ్వేల్ టౌన్, ఆగస్టు 1 (ప్రభాతవార్త):** పట్టణంలోని శ్రీసీతారామ ఉమా మహేశ్వరాలయంలోగల శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రావణమాసం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పంచామృతాభిషేకం, గోపూజ, కుంకుమార్చన, లక్ష పుష్పార్చన, సామూహిక వాసవి పారాయణం నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలతోపాటు అన్నప్రసాదం అందజేశారు.కార్యక్రమంలో పురోహితులు శంకర్, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, నాచారం దేవస్థానం డైరెక్టర్ జగ్గయ్యగారి శేఖర్, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్రనాయకుడు గంప శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు అత్తెల్లి శ్రీనివాస్, నంగునూరి సత్యనారాయణ, మల్యాల భద్రయ్య, గోలి సంతోష్, గంగిశెట్టి వెంకటేశం, ఇటిక్యాల మాజీ సర్పంచ్ రావికంటి చంద్రశేఖర్, సూర ఆంజనేయులు, సిద్ధి నవీన్, తొడుపునూరి కాశినాథ్, బచ్చు రవి, కైలాస ప్రశాంత్, రామారావు, రమేష్, సిరిపురం సత్యనారాయణ, కొమరవెల్లి శంకరయ్య, ఉప్పల కృష్ణమూర్తి, జగ్గయ్యగారి శ్రీనివాస్, తేరాల రాజు, ఉప్పల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## పాత పెన్షన్ పునరుద్ధరించాలి



సభ్యత్వంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

**కొండాపూర్, ఆగస్టు 1(ప్రభాతవార్త):** సిపిఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని టీఎస్‌యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయి అన్నారు. టిఎస్‌యుటిఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని ఆయా పాఠశాలలు జడ్పిహెచ్ఎస్ మల్కాపూర్, జెడ్పిహెచ్ఎస్ మల్లేపల్లి, గుంతపల్లి, గొల్లపల్లి, మునిదేవునిపల్లి తదితర పాఠశాలలను సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని పిఆర్సి నివేదిక విడుదల చేసి వెంటనే 50 శాతం ఫిట్‌మెంట్‌తో పిఆర్సి ఇవ్వాలని, అదేవిధంగా ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రతినెల 700 కోట్లు విడుదల చేసి పెండింగ్ బకాయిలను ఎప్పటికప్పుడు చెల్లించాలన్నారు. బకాయి పడ్డ ఐదు డిఎల్లో కనీసం రెండు డీఎలు వెంటనే ఇవ్వాలి, కేజీబీవీ టీచర్లకు సమ్మె కాలపు వేతనాలు చెల్లించి, బేసిక్ పే వర్తింపజేయాలని కోరారు. మోడల్ స్కూల్ టీచర్లకు 010 హెడ్ కింద జీతాలు ఇవ్వాలని, రెసిడెన్షియల్ పాఠశాలల టైం టేబుల్ మార్చాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ డిమాండ్స్ పరిష్కారం కోసం మూడు దశాబ్దాల పోరాట కార్యక్రమం నిర్వహించబడుతుంది. ఆగస్టు 5న జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నా ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఏ వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## పశువుల పెంపకంపై అవగాహన ఉండాలి

**చిన్నశంకరంపేట, ఆగస్టు 1,ప్రభాతవార్త:** చిన్నశంకరంపేటలోని పశు వైద్యశాలలో సేఫుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కృషిసఖి మహిళలకు వైద్యాధికారి గీతామాలిక పశువుల పెంపకంపై అవగాహన కల్పించారు. పశువులకు సోకే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాల ఉత్పత్తి, పశుపోషణ, వాటి నిర్వహణ వంటి అంశాలపై వివరించారు. కార్యక్రమంలో పశుపోషణ సహాయకుడు రాఘవేందర్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

## గూడు లేని పేదలకే ఇందిరమ్మ ఇళ్లు : ఎమ్మెల్యే



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి.

**నారాయణఖేడ్, ఆగస్ట్ 1 ప్రభాతవార్త :** గూడు లేని పేదలకే ఇందిరమ్మ ఇళ్లు ఇస్తారని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు.నారాయణఖేడ్ పట్టణంలోని భూమయ్య కాలనీలో శుక్రవారం ఇంది రమ్మ ఇండ్ల నిర్మాణా భూమి పూజ నిర్వహించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇల్లు లేని పేద వారికి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఇచ్చిన మాట మేరకు ఈ సంవత్సరం నియోజకవర్గనీకీ 3500 ఇళ్లను మంజూరు చేసిందని చెప్పారు.ఈ ఇండ్ల నిర్మాణాలు పూర్తయిన వెంటనే అదనంగా 1000 మంజరవు తాయని తెలిపారు. ఇల్లు రాలేదని ఎవరూ ఆందో ళన చెందాల్సిన అవసరం లేదని విడతల వారీగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు దారం శంకర్ సెట్ మున్సిపల్ వైస్ చైర్మన్, పండరి రెడ్డి,అర్జున్ మాజీ ఎంపీటీసీ ప్రభాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ నర్సింలు, మున్సిపల్ అధికారులు,వార్డ్ ఆఫీసర్లు, కాలనీ పెద్దలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్‌లో స్పాట్ అడ్మిషన్లు

**జగదేవ్‌పూర్, ఆగస్టు 1 (ప్రభాతవార్త):** మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల, జూనియన్ కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించడం జరుగుతుందని ప్రిన్సిపల్ కాట స్లీవరాజు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో 6వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయడానికి స్పాట్‌అడ్మిషన్లు ఈనెల 4వ తేదీవరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

## మహిపాల్‌రెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్సీ యాదవరెడ్డి

**కొండపాక, ఆగస్టు 1, ప్రభాతవార్త :** తిమ్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కాశిరెడ్డి మహిపాల్‌రెడ్డి ఇటివల్ల కాలంలో రోడ్డు ప్రమాదానికిగురై చికిత్సపొంది ఇంటికి తిరిగిరాగా మెదక్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, డాక్టర్ వంటేరు యాదవరెడ్డి శుక్రవారం తిమ్మారెడ్డిపల్లిలోని మహిపాల్‌రెడ్డి ఇంటికి వచ్చి పరామర్శించారు. అయన వెంట గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, బాలబ్రహ్మం, సాదుపల్లి కనకసేన గౌడ్, కాశిరెడ్డి భూపాల్‌రెడ్డి, నూనె కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అర్బన్ పార్కులో 42 కాటేజీల నిర్మాణం

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



కాటేజీల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**నర్సాపూర్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** నర్సాపూర్ ఫారెస్ట్‌లోగల అర్బన్‌పార్క్‌లో యాత్రికుల సౌకర్యార్థం 42 కాటేజీల నిర్మాణం చేస్తున్నామని ఇందులో 22 కాలేజీల నిర్మాణం పనులు ఈ నెలాఖరు వరకు పూర్తి పూర్తి చేసి ప్రారంభిస్తామని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. శుక్రవారం నర్సాపూర్ పర్యటనలో భాగంగా నర్సాపూర్ ఫారెస్ట్‌లోగల అర్బన్ పార్కును సందర్శించి పార్క్‌లో నిర్మిస్తున్న కాటేజీల నిర్మాణ పనులను పూర్తికావచ్చిన చివరి దశలో ఉన్న కాటేజీలను సంబంధిత అటవీ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నర్సాపూర్ అర్బన్ పార్కు యాత్రికుల సౌకర్యార్థం 42 కాటేజీలు నిర్మాణాలు చేపట్టగా 22 కాటేజీల నిర్మాణ పనులు పూర్తి అవుతాయని ఈ మేరకు నెలాఖరు లోపు ప్రారంభించనున్నట్లు తెలిపారు నర్సాపూర్ అర్బన్ ఫారెస్ట్ పార్కు ప్రకృతి ప్రేమికులకు ఎంతగానో ఆకట్టుకుంటుందని చూడ చక్కని పర్యాటక ప్రాంతంగా విలసిల్లుతుంది అన్నారు. ఎంతోమంది యాత్రికులు ప్రకృతి ప్రేమికులు సెలవు దినాల్లో అర్బన్ పార్క్‌ను సందర్శించి అహ్లాదకరమైన వాతావరణంలో కుటుంబసభ్యులతో సంతోషంగా గడుపుతారు అన్నారు. ఈ మేరకు యాత్రికుల ప్రకృతి ప్రేమికుల సౌకర్యార్థం కాటేజీల నిర్మాణం చేపట్టామని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. నర్సాపూర్‌లో ని ఫారెస్ట్ లో అర్బన్ పార్క్ ఏర్పాటుతో చక్కని పర్యాటక కేంద్రంగా మారుతుందని దీంతో నర్సాపూర్ పేరు నాలుగుదిశల వ్యాపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఆటవీశాఖ అధికారులు ఫారెస్ట్ రేంజ్ అధికారి అరవింద్, సెక్షన్ ఆఫీసర్ సాయిరాం, వివిధ శాఖల అధికారులు, అటవీ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి : ఎఎస్ఐ

**హుస్నాబాద్ రూరల్, ఆగస్టు 1, ప్రభాతవార్త :** విద్యార్థులు సైబర్ నేరాలతోపాటు వారికి ఉండే హక్కులను గురించి అవగాహన కలిగి ఉండాలని ఏఎస్ఐ మణమ్మ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు షీటీమ్ ఆధ్వర్యంలో విద్యార్థులు, మహిళ లకు ఉన్న చట్టాలగురించి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఏఎస్ఐ మాట్లాడుతూ అమ్మాయిలు ఆకతాయిల అల్లర్లు, పొగడ్తలకు పడిపోయి మోసపోవద్దన్నారు. ప్రతీఒక్కరు సైబర్‌నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలని, నేరానికి గురైతే 1930కు వెంటనే ఫిర్యాదు చేయాలన్నారు. మహిళలు వేధింపులకుగురైతే 112, 8712667434 నంబర్‌కు సంప్రదించాలన్నారు. షీటీం బృందం సదయ్య, ప్రశాంతి, స్వప్న, కృష్ణ ఉన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత

**మర్కుక్, ఆగస్టు 1 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని పాములపర్తి గ్రామానికి చెందిన శ్రీగిరిపల్లి పోచయ్య ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందగా అధిక మొత్తంలో ఖర్చు కావడంతో ముఖ్యమంత్రి సహాయనిధికి దంఖాస్తు చేసుకోగా మంజూరైన రూ.26వేల చెక్కును శుక్రవారం తాజా మాజీ ఎంపిపి పాండుగౌడ్ లబ్ధిదారునికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సిఎం సహాయనిధి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఆయనతో పాటు కర్రోళ్ల బాలకృష్ణ అన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

**మర్కుక్, ఆగస్టు 1 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని పాములపర్తి గ్రామానికి చెందిన మంగి రాములు అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ తిరుమల్‌రెడ్డి శుక్రవారం మృతుని కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. పరామర్శించిన వారిలో కొండ పోచమ్మ డైరెక్టర్ కిషన్, కాంగ్రెస్ నాయకులు నర్సింలు, క్రాంతికుమార్, లక్ష్మణ్, రాజయ్య, నాగరాజు తదితరులు ఉన్నారు.

## గ్రామానికి ఫ్రీజర్ బాక్స్‌అందజేత

**సిద్దిపేట అర్బన్, ఆగస్టు 1, ప్రభాతవార్త :** సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని ఎన్సాన్‌పల్లి మాజీ సర్పంచ్ రవీందర్‌గౌడ్ తల్లి జ్ఞాపకార్థం గ్రామ పంచాయతీకి రూ.62 వేల విలువ చేసే ఫ్రీజర్ బాక్స్‌ను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా మృతి చెందితే ఫ్రీజర్ బాక్స్ తెచ్చుకోవడానికి రూ.4 వేల ఖర్చు అవుతుందని తెలిపారు. బాధిత కుటుంబాలపై భారం పడకుండా గ్రామ పంచాయతీకి బాక్స్ అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## గెస్ట్ టీచర్ పోస్టుకు దరఖాస్తుల అహ్వానం

**కొండపాక, ఆగస్టు 1, ప్రభాతవార్త :** కొండపాక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న బయోసైన్స్ ఉపాధ్యాయ పోస్టును బర్తీ చేయడానికి గెస్ట్ టీచర్ (బయోసైన్స్) దరఖాస్తులు అహ్వానిస్తున్నట్లు అ విద్యాలయం ప్రిన్సిపల్ గౌతమి శుక్రవారం తెలిపారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని అమె సూచించారు. సంబంధిత సబ్జెక్ట్‌లో డీగ్రీ కలిగి ఉండి బయాలజీ, బొటాని, జువాలజీకలిగి ఉండాలన్నారు. టెట్ ఉత్తీర్ణత పొందినవారు మాత్రమే అర్హులని తెలిపారు. అసక్తిగల అభ్యర్థులు ఈ నెల 2వ తేది నుండి 4వ తేది వరకు కొండపాకలోని కాస్తూర్బా విద్యాలయంలో అవసరమైన సర్టిఫికెట్ల జిరాక్స్ కాఫీలను సోమవారం సాయంత్రం 5.00 గంటలలోపు సమర్పించాలని అమె సూచించారు.

## జనహితకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

**పాపన్నపేట, ఆగస్టు 1 ప్రభాతార్త :** అందోల్ నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీ శుక్రవారం తలపెట్టిన జనహిత పాదయాత్రకు పాపన్నపేట నుండి పార్టీ నాయకులు తరలి వెళ్ళారు. టిపిసిసి తెలంగాణ ఇంఛార్జి మీనాక్షి నటరాజన్, పిసిసి అధ్యక్షులు మహేష్‌గౌడ్ అధ్వర్యంలో జరుగుతున్న పాదయాత్రకు మండలం నుండి పెద్ద ఎత్తున కార్యకర్తలు, నాయకులు తరలివెళ్ళారు.

## గీతన్నల సామాజిక చైతన్య యాత్రను జయప్రదం చేయండి

**సంగారెడ్డి మున్సిపాలిటీ ఆగస్టు 1,ప్రభాతవార్త :** ఆగస్టు 2 నుండి 18 వరకు నిర్వహించే అమరుల యాదిలో గీతన్నల సామాజిక చైతన్య యాత్రను విజయవంతం చేయాలని కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఆశన్న గౌడ్, ప్రధానకార్యదర్శి రమేష్‌గౌడ్ శుక్రవారం కోరారు. యాత్ర కొండాపూర్



మాట్లాడుతున్న కల్లుగీత కార్మిక సంఘం నాయకులు

## ఎపిఎంగా రాములు

**చిన్నశంకరంపేట, ఆగస్టు 1,ప్రభాతవార్త:** మండల మహిళా సమాఖ్య ఏపీఎంగా రాములు శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. రామాయంపేట మండల డీఆర్డీఏ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్‌గా విధులు నిర్వహించి ఏపీఎంగా పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఏపీఎం లక్ష్మీ నారాయణ కొల్చారంకు బదిలీపై వెళ్లారు. మహిళా సంఘం సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి కృషి చేస్తానని తెలిపారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

**చిన్నశంకరంపేట,ఆగస్టు 1,ప్రభాతవార్త:** మండలపరిధి మల్లుపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ కార్యకర్త సత్తయ్య అనారోగ్య సమస్యలతో బాధదుతూ ఇటీవల మరణించాడు. ఈ విషయం తెలుసుకున్న మెదక్ మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మారెడ్డి రూ.5వేల ఆర్థిక సహాయం పంపగా బిఆర్ఎస్వీ మండలాధ్యక్షుడు ఇమ్మడి నరేష్ శుక్రవారం నాడు బాధిత కుటుంబసభ్యులకు అందించారు. శ్రీహరి, గణేష్, భూమయ్య పాల్గొన్నారు.

## కొల్చారం నూతన ఎస్సైగా అహ్మద్ మోహిద్దీన్

**కొల్చారం, ఆగస్టు 1 ప్రభాతార్త :** కొల్చారం నూతన ఎస్సైగా అహ్మద్ మోహిద్దీన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇక్కడ ఎస్సైగా విధులు నిర్వహించిన మహమ్మద్ గౌస్ గురువారం పదవీవిరమణ చేసిన సంగతి తెలిసిందే. నార్సింగి ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న అహ్మద్ మోహిద్దీన్ బదిలీపై కొల్చారం వచ్చారు. ఈసందర్భంగా మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకోసం కృషి చేస్తానని అన్నారు. మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా తమవంతు కృషి చేస్తానన్నారు.

## కరస్‌గుత్తిలో తల్లిపాలపై అవగాహన

**నాగల్‌గిద్ద, ఆగస్టు 1 ప్రభాతవార్త :** మండల పరిధిలోని కరస్‌గుత్తిలో శుక్రవారం తల్లిపాలపై అవగాహన కల్పించారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో డాక్టర్ జివేరియాబేగం ఆధ్వర్యంలో తల్లిపాల ఆవశ్యకతపై బాలింతలకు వివరించారు. ఈసందర్భంగా గ్రామంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు.

## పేద కుటుంబానికి ఆర్థిక సహాయం

**రామాయంపేట, ఆగస్టు 1 ప్రభాతవార్త :** మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి పేద కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామ నివాసి, వగ్గు లక్ష్మీనారాయణ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పద్మాదేవేందర్‌రెడ్డి అతని కుటుంబానికి రూ.5000 ఆర్థిక సహాయం అందచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు చిట్టిమల్లి నరేందర్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు తాటిపల్లి రాంకీ, శ్రీకాంత్ సాగర్, శ్రవణ్‌గౌడ్, పాపయ్యగారి నరసింహులు, వగ్గు కృష్ణ, బబ్లూ శ్రీకాంత్, వగ్గు రమేష్ రఘుపతి సాగర్, పవన్‌సాగర్, కిశోర్‌సాగర్ తది తరులు పాల్గొన్నారు.

## తెలుగు ఉపాధ్యాయుడికి సన్మానం

**నర్సాపూర్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** 150 పద్యాలు స్వీయ రచన చేసిన తెలుగు ఉపాధ్యాయుడికి ఘనంగా సన్మానించారు. శుక్రవారం చిన్నచింతకుంట ఉన్నత పాఠశాలలో జరిగిన కాంప్లెక్స్ సమావేశంలో తెలుగు ఉపాధ్యాయులు ఎం.పెంటయ్యను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి తారా సింగ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఈఓ తారా సింగ్ మాట్లాడుతూ నర్సాపూర్ మండల పరిధిలోని చిన్నచింతకుంట గ్రామ జెడ్ పి హెచ్ ఎస్ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న ఎం పెంటయ్య తన స్వీయ రచనతో 150 పద్యాలు రాసినందుకు గాను ఆయనను ఘనంగా శాలువాతో పూలమాలతో సన్మానించడం జరిగిందన్నారు. అనంతరం పద్య కవి ఏం పెంటయ్య మాట్లాడుతూ రామచంద్రుడోసగు రక్ష భువికి అని మకుటంతో ఆట వెలదిలో పద్యాలు రాస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ పద్యాలు రచించినందులకు గాను తనకు ఈ సన్మానం చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్‌పిలు శేఖర్, రవి రామశర్మ, భైరవరెడ్డి నర్సాపూర్, శివంపేట మండలాల తెలుగు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులు పెంటయ్యను సన్మానిస్తున్న ఎంఈవో తారాసింగ్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

### మోడల్ ఇళ్ల నిర్మాణానికి స్థలసేకరణ పనులు

## వేగవంతం చేయాలి : జిల్లా కలెక్టర్ ప్రావిణ్య

**సంగారెడ్డి మున్సిపాలిటీ ఆగస్టు 1,ప్రభాతవార్త:** జిల్లాలో జి+3 మోడల్ గృహ నిర్మాణానికి భూదాన్ భూముల గుర్తింపు చర్యలు వేగవంతం చేయాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి.ప్రావిణ్య అన్నారు. అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌తో కలిసి జిహెచ్ఎంసి పరిధిలోని మండలాలకు చెందిన రెవెన్యూ , గృహ నిర్మాణ శాఖ, జిహెచ్ఎంసి అధికారులతో శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయములో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వ ఆదేశాలమేరకు జిల్లాలో జిహెచ్ఎంసి పరిధిలోని మండలాలలో జి+3 మోడల్ గృహ నిర్మాణాల కోసం తాసిల్దార్లు, తమ పరిధిలో భూదాన్ భూములను గుర్తించే ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి చలపతి రావు, పటాన్చెరువు నియోజకవర్గ తహసీల్దార్లు, మునిసిపల్ కమిషనర్లు, జిహెచ్ఎంసి అధికారులు జిహెచ్ఎంసి అధికారుల, సిబ్బంది పాల్గొన్నారు.

## అర్హులందరికీ రేషన్ కార్డులను అందజేస్తాం

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎమ్మెల్యే సునీతారెడ్డి



రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

**వెల్దుర్తి, అగసు 1, ప్రభాతవార్త:** అర్హులందరికీ రేషన్ కార్డులను అందజేయడం జరుగుతుందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. వెల్దుర్తిలోని రైతు వేదికలు శుక్రవారం రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే సునీతలక్ష్మారెడ్డి, మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్, తూప్రాన్ ఆర్డిఓ జయచంద్రరెడ్డి పాల్గొన్నారు. మండలానికి నూతనంగా 385 రేషన్‌కార్డులు మంజూరు కాగా అర్హులైన లబ్ధిదారులకు రేషన్‌కార్డులను అందజేశారు. అలాగే 1489 కుటుంబ సభ్యుల పేర్ల నమోదు చేసుకోవడం జరిగిందన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆహార భద్రత కార్డు ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయని వాటిని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంక్షేమ పథకాలు అందించడం లో రేషన్ కార్డుల ప్రముఖ పాత్ర ఉంటుందని వారన్నారు. అందుకు ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులను పంపిణీచేయడం జరుగుతుందన్నారు. అలాగే మాసాయిపేట మండలంలో 249 రేషన్‌కార్డులను ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి కలెక్టర్ రాహుల్ రాజు ఆవులకు అందించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ భాగ్యలక్ష్మి జ్ఞానజ్యోతి రెవెన్యూ సిబ్బంది నాయకులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

### మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్ చరణ్‌రెడ్డి

**నర్సాపూర్ ఆగస్టు 1, ప్రభాతవార్త:** ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్‌చరణ్‌రెడ్డి సూచించారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వందరోజుల కార్యక్రమంలో భాగంగా నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో డ్రై డే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డుల్లో దోమల నిర్మూలన కోసం పాగింగ్ చేయడం, బ్లీచింగ్ చల్లడం జరిగింది. అదేవిధంగా ఇతర సీజన్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల పై ప్రజలకు అవగాహన కలిగించారు. అంతేగాక నర్సాపూర్ పరిధిలోని ప్రజా మరుగుదొడ్లను, కళాశాల గ్రౌండ్ ను సందర్శించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్ చరణ్ రెడ్డి మాట్లాడుతూ వార్డుల్లోని ప్రజలు తమ చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెత్తాచెదారాలను రోడ్లపై వేయకుండా చెత్త బండి వాహనాల్లో వేయాలన్నారు. మరుగుదొడ్లు, మురికి కాల్వలను ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేయాలని పారిశుద్ధ్య సిబ్బందికి సూచించారు. ఎక్కడ కూడా నీరు నిల్వకుండా ఉండే విధంగా చేయాలన్నారు. నీరు నిల్వ ఉంటే దోమలు చేరి అనారోగ్యం కలిగిస్తాయని ఆయన తెలిపారు. పరిసరాలు పరిశుభ్రత ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్ చరణ్ రెడ్డి తో పాటు సానిటరీ ఇన్స్పెక్టర్ మహేష్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ శ్రీకాంత్,వార్డు అధికారులు ఉదయ్ కుమార్, దుర్గయ్య, పరశురాం రెడ్డి, రాజు, రణదీప్ జవాన్లు ఎల్లం అశోక్ మెప్మా ఆర్పి రేణుక మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## పేదలకు సిఎం సహాయ నిధి ఎంతో మేలు : ఎమ్మెల్యే

**నర్సాపూర్ ఆగస్టు 1, ప్రభాతవార్త:** సిఎం సహాయనిది పేదలకు ఎంతో మేలు కలగజేస్తుందని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో పలువురి బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ పేదరికం అనుభవిస్తూ అనారోగ్యం పాలై ఆసుపత్రుల ఖర్చులు భరించలేక అలమటిస్తున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగపడుతుందన్నారు .అవకాశం ఉన్నందున పేదలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ సహాయం నిజమైన నిరుపేదలకు ఎంతో మేలు చేస్తుందని ఎమ్మెల్యే సునీతా రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీవైస్ చైర్మన్ నయీముద్దీన్, టిఆర్ఎస్ సీనియర్ నాయకులు సత్యం గౌడ్, సూరారం నరసింహులు, తొంట వినయ్, నియోజకవర్గస్థాయి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## అనుమతి లేని కాలేజీలపై చర్యలు తీసుకోండి

**సంగారెడ్డి మున్సిపాలిటీ ఆగస్టు 1, ప్రభాతవార్త:** పటాన్‌చెరు, జహీరాబాద్ పట్టణంలో ఎలాంటి గుర్తింపు లేకుండా జూనియర్, డిగ్రీ కళాశాలను ఒకే భవనంలో నిర్వహిస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పిడిఎస్ యు నాయకులు శుక్రవారం డిఆర్ఓ పద్మజనానికి వినతిపత్రం అందజేశారు. చర్యలు తీసుకోవాల్సిన జిల్లా ఇంటర్మీడియట్ అధికారి చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నాడని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు

## చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

**వెల్దుర్తి, ఆగసు 1, ప్రభాతవార్త:** చేపల వేటకు వెళ్లి చెరువులో పడి ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని చర్లపల్లి శివారులోని నర్సంచెరువులో శుక్రవారం జరిగింది. కుటుంబీకుల కథనం ప్రకారం..వెల్దుర్తికి చెందిన మత్స్యకారుడు పంపరి సత్యనారాయణ(49) రోజు మాదిరిగా శుక్రవారం చేపల పట్టటానికి చర్లపల్లి శివారులోని నర్సంచర్లోకి వెళ్లారు. ప్రమాదవశాత్తు చెరువులు పడి మృతి చెందడంతో ఈ విషయాన్ని కుటుంబీకులు పోలీసులకు సమాచారం అందించారు.పోలీసులు మృతదేహాన్ని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.మృతుడికి భార్య కళావతి, కూతురు లావణ్య ఉన్నారు.

## చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

**హత్నూర, ఆగస్టు 1,ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడని హత్నూర ఎస్సై శ్రీధర్ రెడ్డి తెలిపారు. గత బుధవారం దౌల్తాబాద్ సమీపంలోని పెట్రోల్ పంపు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో గాయాలు అయ్యాయని, అతన్ని గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడని ఎస్ఐ తెలిపారు.

# హరీష్‌రావును విమర్శిస్తే గుణపాఠం తప్పదు

### బిఆర్ఎస్ నాయకులు



మాట్లాడుతున్న లింగారెడ్డిపల్లి గ్రామ బిఆర్ఎస్ నాయకులు

**సిద్దిపేట అర్బన్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన రెండేళ్లు కావాస్తున్న ప్రజలకు ఒరగబెట్టిందేమిలేదని...గత బిఆర్ఎస్ పదేళ్లపాలనలో సిద్దిపేట అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగిన మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావుపై నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి హరి కృష్ణ అర్థం, పర్థం లేకుండా విమర్శలు చేయడం సిగ్గుచేటని బిఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. లింగారెడ్డిపల్లిలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర నాయకులు మెరుగు మహేష్, మాజీ సర్పంచ్ బొండ్ల రామ స్వామి, మాజీ ఎంపిటిసిలు కదుర్ల బాలయ్య, బండి రంగయ్య మాట్లాడారు. కాంగ్రెస్‌పార్టీ రెండేళ్ల కాలంలో పట్టుమని పది లక్షల ప్రొసీడింగులు తెచ్చి ఏ ప్రొటోకాల్ ఉందని నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రభుత్వ పనులకు భూమిపూజలు చేస్తున్నారని ప్రశ్నించారు. పూజల హరికృష్ణ ప్రజాప్రతినిధికాదని గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించిన వ్యక్తి అని తెలిపారు. హరీష్‌రావు గ్రామాలలో, పట్టణంలో అభివృద్ధిని పట్టించుకోలేదని అబద్దాలు చెప్పి ప్రజల మన్ననలు పొందాలని చూస్తే ఆ ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంత్రిగా, సిద్దిపేట ఎమ్మెల్యేగా హరీష్ రావు లింగారెడ్డిపల్లిలో సుమారు రూ.15 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారని గుర్తు చేశారు. సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, బీటీ రోడ్లు, వివిధ కులాలకు ఫంక్షన్‌హాల్స్, డబుల్‌బెడ్ రూంలు నిర్మించి ఇవ్వడంతో పాటు దేవాలయాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని తెలిపారు. అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించే హరీష్‌రావుపై మరోసారి విమర్శలు, ఆరోపణలు చేస్తే కాంగ్రెస్ నాయకులను గ్రామ పొలిమేరలో అడుగుపెట్టనివ్వమని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ నాయకులు శ్రీనివాస్, మహేష్, ప్రశాంత్, మాధవ్, లక్ష్మీ, కృష్ణవేణి, నరేష్, పర్శ రాములు, మధు, మోహన్, కనకయ్య, వినయ్, రాజయ్య, పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

## పాదయాత్రకు తరలిన మునిపల్లి కాంగ్రెస్‌నేతలు




పాదయాత్రకు తరలివెళ్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు

**మునిపల్లి, ఆగస్టు 1, ప్రభాతవార్త:**
అందోల్ నియోజకవర్గంలోని సంగుపేటనుంచి జోగిపేట వరకు జరుపతల పెట్టిన కాంగ్రెస్ జనహిత పాదయాత్రకు మునిపల్లి మండలంలోని వివిధ గ్రామాలనుండి కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. మండలంలోని బుధేరా చౌరస్తానుంచి ర్యాలీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా మండలపార్టీ అధ్యక్షుడు సతీష్‌కుమార్ మాట్లాడుతూ జనహిత పాదయాత్రతో కాంగ్రెస్ కార్యకర్తల్లో ఉత్సాహం రెట్టింపు అయిందన్నారు. కార్యక్రమానికి తరలినవారిలో మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, మాజీఎంపిపి రాంరెడ్డి, నాయకులు నర్సింహ్మగౌడ్, వీరన్నపాటిల్, వెంకట్రాములు, నారాయణ, శంకరయ్య, సంగమేశ్వర్, వీరన్న వున్నారు.

## ఉపాధ్యాయుల ధర్నాను జయప్రదం చేయండి



కరపత్రాన్ని ప్రదర్శిస్తున్న టిఎస్‌యుటిఎఫ్ నాయకులు

**వట్‌పల్లి, ఆగస్టు 1, ప్రభాతవార్త:**
సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలంలోని వివిధ పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల తక్షణ పరిష్కారం కోసం ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో దశలవారీ పోరాటంలో భాగంగా 2వదశ జిల్లా కేంద్రం సంగారెడ్డిలో ఈ నెల 5వతేదీన తలపెట్టిన ఉపాధ్యాయుల ధర్నాను జయప్రదం చేయాలని టిఎస్‌యుటిఎఫ్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కంబపురం అశోక్, వట్పల్లి మండల అధ్యక్ష, కార్యదర్శులు శివరాజ్, ప్రభు కోరారు. విద్యారంగంలో ఎన్జీవోల జోక్యాన్ని నివారించాలని డిమాండ్‌చేశారు. ఉపాధ్యాయులు యాదయ్య, బిక్షపతి, రాజు, రమేష్, వెంకటేశం, అఖిల తదితరులు పాల్గొన్నారు.

## పిఆర్‌టియుఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడి నియామకం



రవీందర్‌రావుపాటిల్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**నాగల్‌గిద్ద, ఆగస్టు 1, ప్రభాతవార్త:**
పిఆర్‌టియుఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మండల పరిధిలోని కారముంగి గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్‌రావుపాటిల్‌కు అవకాశందక్కింది. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియామకం అయిన రవీందర్‌రావుపాటిల్‌ను శుక్రవారం ఘనంగా సన్మానించారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్సీ పి.శ్రీపాల్‌రెడ్డి, పిఆర్‌టియుఎస్ రాష్ట్ర అధ్యక్షులు జి.లక్ష్మణ్, ప్రధానకార్యదర్శి పి.దామోదర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు ఆచార్య ఏక్కం పాండురంగారెడ్డి, జిల్లాఅధ్యక్షులు ఎ.మాణయ్య, ప్రధానకార్యదర్శి ఎ.ప్రభు, మండల అధ్యక్షులు రమేష్, ప్రధాన కార్యదర్శి నాగనాథ్, జోన్‌సభ్యులు రవీందర్‌రావుపాటిల్ కృతజ్ఞతలు తెలిపారు.

## షీటీంపై విద్యార్థులకు అవగాహన

**నాగల్‌గిద్ద, ఆగస్టు 1, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని కరస్‌గుత్తిలోని ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు షీం టీంపై అవగాహన కల్పించారు. సోషల్ మీడియా పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లతోపాటు అపరిచితుల ఫోన్‌లకు దూరంగా ఉండాలన్నారు. తెలియని లింక్‌లను ఓపెన్ చేయకూడదని సూచించారు.

## బిసిలపై కాంగ్రెస్‌ది కపటనాటకం

**-బిజెపినేత అరుణ్‌రాజ్ శేరికార్**



విలేకరులతో మాట్లాడుతున్న బిజెపి నాయకులు

**సిర్గాపూర్, ఆగస్టు 1, ప్రభాతవార్త:**
బిసిలపట్ల కాంగ్రెస్‌ప్రభుత్వం కపటనాటకం ఆడుతోందని, చేసిన హామీలను అమలుచేయకుండా ప్రజలను మోసంచేస్తోందని భారతీయ జనతా పార్టీ ఓబిసిమోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యులు అరుణ్‌రాజ్‌శేరికార్ విమర్శించారు. గురువారం బిజెపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో అరుణ్‌రాజ్‌శేరికార్ మాట్లాడుతూ ఆగస్టు 2వ తారీఖున హైద్రాబాద్‌లోని ధర్నాచౌక్, ఇందిరాపార్క్ వద్ద నిర్వహించబోయే బిసి హక్కుల ధర్నాలో ప్రజలు భారీగాపాల్గొనాలని సూచించారు. బిసిలను కాంగ్రెస్‌ప్రభుత్వం మభ్యపెడుతోందని ఆందోళన వ్యక్తంచేశారు.

## టీచర్ల ముఖ గుర్తింపుప్రక్రియకు సర్వర్ బిజీ

**సిర్గాపూర్, ఆగస్టు 1, ప్రభాతవార్త:**
మండలంలో ఉపాధ్యాయుల ముఖగుర్తింపుప్రక్రియ శుక్రవారం ప్రారంభం అయింది. గుర్తింపు ప్రక్రియను ప్రారంభించినా సర్వర్ బిజీతో అంతరాయం ఏర్పడుతోంది. మండలంలోని వాసర్, కడపల్, సిర్గాపూర్ పాఠశాలల కాంప్లెక్స్ పరిధిలోని ఆయా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు ఎఫ్ఆర్ఎస్ కార్యచరణ చేపట్టారు. సర్వర్ బిజీ వస్తుండటంతో పలువురు ఉపాధ్యాయుల ముఖగుర్తింపు నమోదుకాలేదని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించేందుకు విద్యాశాఖ ముఖ గుర్తింపు ప్రక్రియను ప్రవేశపెట్టిన విషయం విదితమే.

## అధ్యయనయాత్రను జయప్రదం చేయండి

**మెదక్ టౌన్, ఆగస్టు 1, ప్రభాతవార్త:**
ఆగస్టు 1నుండి 5వరకు విద్యార్థి అధ్యయనయాత్రను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ అన్నారు. నర్సాపూర్‌లో ఉన్న పిజి కళాశాలకు సొంత భవనం ఏర్పాటుచేసి, ఎత్తివేసిన కోర్సులను తిరిగి ప్రారంభించాలని, మెదక్ జిల్లాకేంద్రంలో పిజి ఇంజనీరింగ్ కళాశాలలు ఏర్పాటుచేయాలని, తూప్రాన్, పెద్దశంకరంపేటలలో డిగ్రీ కళాశాలలు ఏర్పాటుచేయాలని,గురుకులాలు,సంక్షేమహాస్టళ్లకు సొంతభవనాలు నిర్మించాలని, ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదలచేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు నవీన్. నోముల అజయ్, అజయ్‌కుమార్, తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

# పెంచిన పెన్షన్ వెంటనే అమలు చేయాలి

**-సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు మాణిక్యం**



రైతులతో మాట్లాడుతున్న మాణిక్యం

**కొండాపూర్, అగస్టు 1, ప్రభాతవార్త:**
పెంచిన పెన్షన్ వెంటనే అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు మాణిక్యం అన్నారు. మండలంలోని మహందాపూర్ గ్రామంలో పర్యటించి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలలో వృద్ధప్య వితంతు పెన్షన్లు రూ.2016 నుంచి రూ.4016చేస్తామని, వికలాంగుల పెన్షన్ 3016 నుంచి రూ.6016 ఇస్తామని ఎన్నికలలో వాగ్దానాలు చేశారు.ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు పెన్షన్ పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్కీమ్ వర్కర్లకు, కాంట్రాక్ట్ కార్మికులకు గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు పెంచాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా గ్రామంలో గల సర్వే నెంబర్ 22లో సుమారు 300 ఎకరాల భూమిని దశాబ్దాల కాలంగా సాగు చేసుకొని కాలం గడుపుతున్నా రైతుల భూమిని కంపెనీలకు అప్పజెప్పే ప్రయత్నం చేస్తుందని అన్నారు. భూములు ఇవ్వవలసి వస్తే 2013 చట్ట ప్రకారం పరిహారం ఇవ్వాలన్నారు.ప్రతి కుటుంబానికి ఒక ఉద్యోగం ఇవ్వాలని, రైతుల ఒప్పందంతో భూములు తీసుకోవాలని, ప్రభుత్వాలు ఇష్టంవచ్చినట్టు భూములు తీసుకుంటే ఊరుకునేది లేదు అన్నారు.కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండలకార్యదర్శి కే.రాజయ్య, బాబురావు, సుధాకర్, అమృతమ్మ, రమేష్, సంజీవులు, శ్రీశైలం, విక్రమ్, రైతులు పాల్గొన్నారు.

## కార్పొరేటర్ మార్నింగ్ వాక్ విత్ అఫీషియల్స్



మార్నింగ్ వాక్ విత్ అధికారులతో కార్పొరేటర్ పుష్పనగేష్

**రామచంద్రాపురం, ఆగస్టు 1, ప్రభాతవార్త:**
రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని కనుకుంటలో శుక్రవారం ఉదయం కార్పొరేటర్, జిహెచ్ఎం స్టాండింగ్ కమిటీ సభ్యురాలు బూరగడ్డ పుష్పనగేష్ అధికారులతో కలసి కాలనీలో మార్నింగ్‌వాక్ చేశారు. బస్తీలో ఉన్న సమస్యలను అధికారులతో కలిసి కార్పొరేటర్ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. బస్తీలోకి సకాలంలో శానిటేషన్ సిబ్బంది రావడం లేదని, ఫలితంగా కాలనీ అపరిశుభ్రంగా మారిందని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకుపోగా స్పందించిన కార్పొరేటర్ డిసికి సమస్యను వివరించి రాజో వారిగే శానిటేషన్ సిబ్బందిని పంపాలని ఆదేశించారు. పోలీసు క్వార్టర్స్ ముందు ఉన్న బస్తీలో ఉన్న ఖాళీగా ఉన్న పాత ఇళ్లలో చెత్త నింపుతున్నారని తెలుసుకుని చెత్తను తొలగించాలని బాధ్యులను ఆదేశించారు. కాలనీలో దోమల బెడద రాకుండా పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ సురేష్, ఎఎంఓహెచ్ విజయ్‌మోహన్, ఎస్ఎస్ కేశవులు, జవాన్ పవన్, ఎస్ఆర్పీ మల్లికార్జున్, రాంకి ఇంచార్జి విజయభాస్కర్‌రెడ్డి, టౌన్ ప్లానింగ్ ఎసిపి రాణి, ఎంటమాలజీ ఎఈ తిరుపతయ్య, జిహెచ్ఎంసి శానిటేషన్, రాంకీవిభాగ అధికారులు, సిబ్బంది, కాలనీనాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ క్రైమ్ నియంత్రణపై అవగాహన

**-ఎస్పి డి.శ్రీనివాసరావు**




మాట్లాడుతున్న జిల్లా ఎస్పి శ్రీనివాసరావు

**మెదక్ టౌన్, ఆగస్టు 1, ప్రభాతవార్త:**
జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం సైబర్ వారియర్స్‌ని ఉద్దేశించి జిల్లా ఎస్పి శ్రీనివాసరావు మాట్లాడుతూ నేటి డిజిటల్‌యుగంలో సైబర్ నేరాలు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో, ప్రతి పోలీస్ సిబ్బంది, సైబర్ రంగంలో పూర్తి అవగాహన కలిగి ఉండటం అవసరమన్నారు. మెదక్ జిల్లా పరిధిలో సైబర్‌క్రైమ్ నియంత్రణపై సిబ్బందికి ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్‌నేరాలు నిరోధించేందుకు ప్రతిపోలీస్ అధికారి సాంకేతిక పరిజ్ఞానాన్ని మెరుగుపరుచుకొని, ప్రతికేసును సీరియస్‌గా తీసుకుని బాధితులకు తక్షణన్యాయం జరిగేటట్లు చూడాలన్నారు. సైబర్‌నేరాలపై సమగ్ర అవగాహనతోనే సమర్థవంతమైన చర్యలు తీసుకోవచ్చు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో సైబర్‌నేరాలపై నిపుణులుగా ఏర్పడాలి. ప్రజలకు తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. 1930ద్వారా వెంటనే ఫిర్యాదు చేయాల్సిన అవసరాన్ని ప్రజలకు తెలియజేయలన్నారు. మెదక్ జిల్లా పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్‌లలో విధులు నిర్వహించేటటువంటి సైబర్ వారియర్స్ అందరికీ తెలంగాణ సైబర్‌సెక్యూరిటీబ్యూరో, హైదరాబాద్ 'టీషర్ట్స్' అందివ్వడం జరిగింది. పోలీసుస్టేషన్లో సైబర్‌వారియర్స్ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు.

## ఉపాధ్యాయులు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

**-మండల విద్యాధికారి ప్రతాప్‌రెడ్డి**

**పాపన్నపేట, ఆగస్టు 1, ప్రభాతవార్త:**
మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవలసిన అవసరం ఉపాధ్యాయులపై ఉందని పాపన్నపేట మండలవిద్యాధికారి ప్రతాప్‌రెడ్డి వెల్లడించారు. శుక్రవారం మండల కేంద్రమైన పాపన్నపేటతో పాటు మండలపరిధిలోని కొత్తపల్లిలో కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయినారు. ఆయనతోపాటు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు. మహేశ్వర్, దత్తురెడ్డి, ఉపాధ్యాయులు అంజాగౌడ్, మంగనర్సింలు, పరుశరాములు, తులసీరామ్, వీరేశం, సమీర్, దుర్గాప్రసాద్, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## నల్లవాగు ప్రాజెక్టు కాల్వల్లో పూడిక తొలగింపు



నల్లవాగు ప్రాజెక్టు కాల్వల్లో పూడికలు తొలగించిన దృశ్యం

**సిర్గాపూర్, ఆగస్టు 1, ప్రభాతవార్త:**
మండలంలోని నల్లవాగు ప్రాజెక్టు నుంచి పంటల సాగుకు సాగు నీరు సరఫరా అయ్యే కాలువల్లో పేరుకుపోయిన మట్టిని తొలగించేపనులు చేపట్టినట్లు ప్రాజెక్టు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పవన్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి నల్లవాగు ప్రాజెక్టును సందర్శించిన సందర్భంగా కాల్వల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని అధికారులను ఆదేశించిన విషయం పాఠకులకు విదితమే. అధికారులు కాల్వలను శుభ్రంచేస్తుండటంతోపాటు జంగల్ క్లియరెన్స్ చర్యలు చేపడుతున్నారు. కాలువలు శుభ్రం అయిన ప్రాజెక్టు నుంచి సాగునీరు పంట పొలాలకు సాఫీగా అందుతాయని చెప్పవచ్చు.

## పాదయాత్రకు బయల్దేరిన కాంగ్రెస్ శ్రేణులు



కాంగ్రెస్ జనహిత పాదయాత్ర సభకు తరలివెళుతున్న కాంగ్రెస్ శ్రేణులు

**పుల్‌కల్, ఆగస్టు 1, ప్రభాతవార్త:**
అందోల్ మండల పరిధిలోని సంగుపేట నుంచి నియోజకవర్గ కేంద్రమైన జోగిపేట వరకు గురువారం నిర్వహించిన కాంగ్రెస్ జనహిత పాదయాత్రకు ఉమ్మడి పుల్‌కల్ మండలంలోని పుల్‌కల్, చౌటకూరు మండలాల నుంచి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షినటరాజన్, టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖమంత్రి సి.దామోదర్ రాజనర్సింహులు పాదయాత్ర నిర్వహిస్తుండటంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న వాహనాల్లో కాంగ్రెస్‌కు అనుకూలంగా నినాదాలు చేస్తూ తరలివెళ్లారు. కార్యక్రమంలో పుల్‌కల్, చౌటకూరు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దుర్గారెడ్డి, నత్తి దశరథ్, జోగిపేట ఆత్మ కమిటి చైర్మన్ మల్లారెడ్డి, నాయకులు రామచంద్రారెడ్డి, లక్ష్మారెడ్డి, ఈశ్వర్‌గౌడ్, గోవర్ధన్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, అంజయ్య, రామాగౌడ్, మోహన్‌రెడ్డి, మహేష్, చంటి రమేష్ తదితరులు తరలివెళ్లిన వారిలో ఉన్నారు.

## తల్లిపాలే బిడ్డకు అమృతం..

**-ఖేడ్ సిడిపిఓ సుజాత**



తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్న అధికారులు

**నారాయణఖేడ్, ఆగస్ట 1, ప్రభాతవార్త:**
తల్లిపాలే శిశువుకు అమృతమని నారాయణఖేడ్ ఐసిడిఎస్ సిడిపిఓ సుజాత అన్నారు. తల్లిపాల వారోత్సవాలో భాగంగా నారాయణఖేడ్ మండలంలోని లింగాపూర్ అంగన్‌వాడీ సెంటర్2లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యత గురించి తల్లులకు చెప్పడం జరిగింది. శిశువుకు తల్లిపాలే ముద్దని..ప్యాకెట్ పాలు వద్దని ఆమె ఈసందర్భంగా తెలిపారు. గర్భిణులు, బాలింతలు ఆరోగ్యకరమైనటువంటి ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో నిజాంపేట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తరని, ఎసిడిపిఓ సుశీల, అరవింద్, గ్రామపంచాయతీ సెక్రటరీ నాగలక్ష్మి, ఎఎన్ఎం శాంత, అంగన్‌వాడీ టీచర్స్ జట్ల ఇందిర, విజయ, ఆశాకార్యకర్తలు లక్ష్మి, అనురాధ, తల్లులు మొదలగువారు పాల్గొన్నారు.

# దేవాదాయశాఖ ఉద్యోగులకు ఇన్సూరెన్స్‌లు కల్పించాలి

**-కమిషనర్‌కు వినతిపత్రం అందచేసిన ఎమ్మెల్సీ అంజిరెడ్డి**



దేవాదాయశాఖకమిషనర్‌కు వినతిపత్రంఅందచేస్తున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

**రామచంద్రాపురం, ఆగస్టు 1, ప్రభాతవార్త:**
దేవదాయశాఖ పరిధలో రాష్ట్రంలో ఉన్న దేవాలయాల్లో కాంట్రాక్ట్ బేసిస్‌లో సేవలు అందిస్తున్న ఉద్యోగులందరికీ అన్నిరకాల ఇన్సూరెన్స్‌లు కల్పించాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి కమిషనర్ వెంకటేశ్వర్‌రావుకు శుక్రవారం వినతిపత్రం అందచేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల భద్రతకు ఇన్సూరెన్స్ కల్పించడంతోపాటు ఉద్యోగులకు, అర్చకులకు కనీస వేతనాలు, పిఎఫ్, ఈఎస్ఐ, ప్రధానమంత్రి సురక్షబీమాయోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి యోజన, ఎస్‌బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ లాంటివి కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. హిందూ దేవాలయాల్లో టికెట్ ధరల్లోనే దేవాదాయ పరిసరాల్లో ఉన్న భక్తులకు ఇన్సూరెన్స్ కల్పించాలని కమిషనర్‌కు కోరినట్లు అంజిరెడ్డి పేర్కొన్నారు.

## పిఎంశ్రీ మోడల్ స్కూల్‌లో స్పాట్ అడ్మిషన్లు

**వట్‌పల్లి, ఆగస్టు 1, ప్రభాతవార్త:**
వట్‌పల్లి మండల కేంద్రంలోని పిఎంశ్రీ మోడల్ స్కూల్, కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నాయని పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.దీన ఒక ప్రకటనలో తెలిపారు. ఆరవతరగతినుంచి ఇంటర్మీడియట్‌వరకు ఖాళీగా ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్‌ప్రక్రియ జరుగుతుందన్నారు. ఆయా తరగతులలో చేరాలనుకునే విద్యార్థులు వారి విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని ఆమె కోరారు. వివరాలకై 7569382704 నెంబరకు కాల్‌చేసి సంప్రతించాలన్నారు.

## పాదయాత్రకు తరలివెళ్లిన వట్‌పల్లి కాంగ్రెస్ నాయకులు



పాదయాత్రకు తరలివెళ్లిన కాంగ్రెస్ నాయకులు

**వట్‌పల్లి, ఆగస్టు 1, ప్రభాతవార్త:**
వట్‌పల్లి మండల కేంద్రం నుంచి జోగిపేట పాదయాత్రకు కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ అనుబంధసంఘాల నాయకులు పాల్గొన్నారు.

## స్థానికసంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తాం

**-సిపిఐ జిల్లా కార్యదర్శి జలాలోద్దీన్**




సిపిఐ జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా కార్యదర్శి జలాలోద్దీన్

**జహీరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:**
రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ పార్టీ పోటీ చేస్తుందని పిపిఐ జిల్లా కార్యదర్శి జలాలోద్దీన్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని సిపిఐ పార్టీ కార్యాలయ ఆవరణలో పార్టీ జెండాను ఆవిష్కరించి డివిజన్ కార్యదర్శి కె.నరసింహులు అధ్యక్షతన డివిజన్ 4వ మహాసభలను నిర్వహించారు. ఈసందర్భంగా జలాలోద్దీన్ మాట్లాడుతూ పేద ప్రజల కోసం పోరాడేది ఎర్రజెండానే అని గుర్తుచేశారు. రాబోయే రెండు సంవత్సరాల భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకుని ముందుకు సాగుతామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతున్నామన్నారు. స్థానికసంస్థల ఎన్నికల్లో బలమున్న స్థానాల్లో పార్టీ అభ్యర్థులు బరిలో ఉంటారన్నారు. కార్యక్రమంలో తంజం ఎ.ఇన్సఫ్ జిల్లా అధ్యక్షులు అశ్వక్‌హుసేన్, అఫ్జల్, తజోద్దీన్, బీర్బల్, శంకర్, ఇర్ఫాన్, విశ్వనాథ్, గౌస్, వినోద్, అమీర్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## అందోల్ పాదయాత్రకు తరలివెళ్లిన కాంగ్రెస్ నేతలు



పాదయాత్రకు గిరిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో తరలిన కాంగ్రెస్‌శ్రేణులు

**జహీరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:**
అందోల్ నియోజకవర్గంలో శుక్రవారం రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షినటరాజన్, టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖమంత్రి సి.దామోదర్ రాజనర్సింహుల ఆధ్వర్యంలో జరిగే జనహితపాదయాత్రలో పాల్గొనేందుకు జహీరాబాద్ నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి డాక్టర్ ఎ.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ముఖ్యనాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈసందర్భంగా మాజీమంత్రి జనహిత పోస్టర్‌ను ఆవిష్కరించి కాంగ్రెస్‌కు అనుకూలంగా నినాదాలు చేస్తూ ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న వాహనాల్లో తరలివెళ్లారు. ఇదిలా ఉండగా రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని గిరిధర్‌రెడ్డికి చెందిన గెస్ట్‌హౌజ్‌కు నాయకులు వాహనాల్లో చేరుకుని జనహిత పాదయాత్రకు తరలివెళ్లారు.

## పర్యాటక రైలు ద్వారా ప్రత్యేక ప్యాకేజీలు

**-ఐఆర్‌సిటిసి టూరిజం అసిస్టెంట్ మేనేజర్ పివి వెంకటేష్**



మాట్లాడుతున్న ఐఆర్‌సిటిసిటూరిజం అసిస్టెంట్‌మేనేజర్ పివి వెంకటేష్

**మెదక్ టౌన్, ఆగస్టు 1, ప్రభాతవార్త:**
మెదక్ పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో శుక్రవారం రైల్వే అధికారులు మీడియాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సౌత్ సెంట్రల్ జోన్ ఐఆర్‌సిటిసి టూరిజం అసిస్టెంట్ మేనేజర్ పివి వెంకటేష్ మాట్లాడుతూ తీర్థయాత్రల కోసం భారత ప్రభుత్వం భారత్ గౌరవ్ టూరిస్ట్ ట్రైన్ ద్వారా ప్రత్యేక టూరింగ్ ప్యాకేజీలు ఏర్పాటు చేసిందన్నారు. పంచజ్యోతిర్లింగాల దర్శనయాత్ర ఉంటుందన్నారు. అందులో భాగంగా మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్, త్రయంబకేశ్వర్, భీమశంకర్, గృష్ణేశ్వర్ జ్యోతిర్లింగాల దర్శనంతో పాటు అంబేద్కర్ దీక్షాభూమి, జన్మభూమి చూడొచ్చన్నారు. ఆగస్టు 16వ తేదీన మధ్యాహ్నం 2గంటలకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి ప్రత్యేకరైలు బయలుదేరుతుందన్నారు. కామారెడ్డి, నిజామాబాద్, ధర్మాబాద్, ముదఖేడ్, నాందేడ్ పూర్ణ మీదుగా ఉజ్జయిని చేరుకుంటుందన్నారు. మెదక్ జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జోనల్ అధికారి నరేష్‌బాబు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై దాడి..7గురిపై కేసు

**కంగ్టి, ఆగస్టు 1, ప్రభాతవార్త:**
గురువారం అర్థరాత్రి 12 గంటలకు కంగ్టి మండలం బిమ్రాగ్రామంలో గంగ్‌శెట్టి కిరాణాషాపు ముందు పేకాట ఆడుతున్నారని నమ్మదగిన సమచారం రావడంతో వెంటనే సిఐ వెంకట్‌రెడ్డి, ఎస్సై దుర్గారెడ్డి, సిబ్బందితో కలిసి రైడ్‌చేశారు. రెడ్‌హ్యాండెడ్‌గా ఏడుగురిని పేకాట ఆడుతుండగా పట్టుకోవడం జరిగింది. వారి వద్ద మొత్తం రూ.9260 సీజ్ చేసి కేసు నమోదు చేసి రిమాండ్ చేయడం జరుగుతుందన్నారు. మండలంలో ఎవరైనా పేకాట ఆడితే 8712656734, 8712656760 నంబర్లకు సమాచారం ఇవ్వాలని, వారివివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. దీని వల్ల సంసారాలు నాశనమై అప్పులపాలు అవుతారన్నారు. అది ఒక వ్యసనంలాగా మారి తాగుడుకు బానిస అవుతారన్నారు.